వరిచేలో కుమార సందడి


తాను నాటిన పొలంలో వరి మొక్కలను చూస్తున్న కుమారస్వామి

మండ్య, న్యూస్‌టుడే: గత నెల పాండవపుర తాలూకా సీతాపురలోని పొలంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి వరి నాట్లు వేశారు. ఆ పొలాన్ని వీక్షించేందుకు ఆదివారం వెళ్లారు. నాట్లు వేసిన వ్యవసాయ కూలీలు, పొలం యజమాని, చుట్టుపక్కల రైతులతో ఆయన ముఖాముఖి అయ్యారు. మహిళలు వండిన నాటు కోడి కూర, రాగి సంకటిని మాజీ మంత్రి సీఎస్ పుట్టరాజు, ఇతర నేతలతో కలిసి సంతృప్తిగా తిన్నారు. తాను నాటిన పొలంలో చక్కని దిగుబడి రావాలని కోరుకున్నానని చెప్పారు. వరి కోత, కుప్ప నూర్పిడి సమయంలోనూ తాను ఇక్కడకు మళ్లీ వస్తానని తెలిపారు.

బదులివ్వాల్సింది శోభానే

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కాపాడేందుకు ముడా కార్యాలయంలో దస్త్రాలను దొంగిలించుకు వచ్చి వాటిని తగలబెట్టారని ఆరోపిస్తున్న కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె దానికి తగిన ఆధారాలు చూపించాలని మంత్రి భైరతి సురేశ్ డిమాండ్ చేశారు. ఆరోపణలు చేయడం, అనంతరం న్యాయస్థానం ముందు క్షమాపణలు కోరడం ఆమెకు అలవాటైందని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప భార్య ఎలా చనిపోయిందో ముందు బదులిచ్చి, అనంతరం తనపై ఆరోపణలు చేయాలన్నారు. తాను ముడా నుంచి ఎటువంటి దస్త్రాలు తీసుకోలేదని, ధర్మస్థలలో మంజునాథేశ్వరుని ముందు సత్య ప్రమాణం చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ముడాలో సీసీ కెమెరాలు ఉన్నాయని, వాటిని ఈడీ అధికారులు ఇప్పటికే పరిశీలించారని గుర్తు చేశారు. ఆరోపణలు చేయడాన్ని మానుకుని, వాస్తవాలను మాట్లాడాలని శోభకు ఆయన హితవు పలికారు.

చెన్నపట్టణ చిక్కేదెవరికో?

- కుమారకే అభ్యర్థి ఎంపిక బాధ్యత
- కాంగ్రెస్‌లో అంతర్మథనం
- తాజా, మాజీ ముఖ్యమంత్రులకు ప్రతిష్ఠాత్మకం


మంత్రులతో సమావేశమైన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: చెన్నపట్టణ ఉప ఎన్నిక అభ్యర్థి ఎంపికను కాషాయ పార్టీ కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిపై ఉంచింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపికపై సుదీర్ఘంగా సమీక్షలు చేస్తోంది. దళ్‌కు బాధ్యత అప్పగించిన విషయాన్ని భాజపా పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప స్వయంగా వెల్లడించారు. ఆ స్థానం నుంచి పోటీ చేసేందుకు మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ మునిగాళ్లపై వేచి చూస్తున్నారు. తాను రాజీనామా చేయడంతో వచ్చిన చెన్నపట్టణ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో తన కుమారుడు నిఖిల్‌ను లేదా భార్య అనితను బరిలో నిలపాలని కుమారస్వామి మొదట కోరుకున్నారు. యోగేశ్వర్ తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేసినా, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ పోటీ చేసినా, ఓట్లు చీలి తన భార్య లేదా కుమారుడు గడ్డు పరిస్థితిని ఎదుర్కొనవలసి వస్తుందని కుమార అంచనాకు వచ్చారు. సీపీ యోగేశ్వర్ తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేయకుండా కట్టడి చేయాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరేందుకు భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర హస్తినకు శనివారం రాత్రి బయలుదేరారు. దళ్ నుంచి సీనియరు కార్యకర్త మంజునాథ్‌ను పోటీలో నిలపాలని నిఖిల్ ఇప్పటికే సూచనలు చేశారు.

తనా.. తనయా?

చెన్నపట్టణ నుంచి శివకుమార్ తన పెద్ద కుమార్తె ఐశ్వర్యను కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగుతారని ప్రచారం జరిగింది. తానూ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని మాజీ ఎంపీ, శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ ఆదివారం ప్రకటించారు. చెన్నపట్టణ నుంచి తానే పోటీ చేస్తానని కుమారస్వామి, డీకే శివకుమార్ వేర్వేరుగా ప్రకటించారు. చెన్నపట్టణ నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల కేటాయింపు, రహదారుల మరమ్మతు, చెరువుల్లో పూడిక తీత, కుళాయి కనెక్షన్లు, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల పెంపునకు శివకుమార్ నేతృత్వం వహించారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఇక్కడకు వచ్చి ఓటు వేసిన తర్వాత టాటా చెప్పి పరారైన నేతను తాను కాదని కుమారస్వామి వ్యాఖ్యానించారు. చెన్నపట్టణ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సీపీ యోగేశ్వర్ పోటీ చేస్తారని కుమారస్వామి ఆదివారం సాయంత్రం బాంబు పేల్చారు. భాజపా నుంచి టికెట్ రాకపోవడంతో కాంగ్రెస్ ఆయనకు గేలం వేస్తోందని ఆరోపించారు. భాజపాకు రెండు నియోజకవర్గాలను విడిచి పెట్టామని, తమకు చెన్నపట్టణలో అభ్యర్థి ఎంపికకు అనుమతించాలని దళపతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు చెన్నపట్టణలో తిరుగుబాటు అభ్యర్థి పోటీ చేస్తే పరిస్థితి ఏమిటని భాజపా, దళ్ నాయకులను మరోసారి ఆలోచించుకునేలా చేస్తోంది. కుమారస్వామి ఆచితూచి తీసుకునే నిర్ణయంతో తమ గెలుపు అవకాశాలకు గండి కొడుతుందని కమలనాథులు భావిస్తున్నారు. చెన్నపట్టణలో గెలుపు సాధించి దళ్ కోట గోడల్ని బద్దలు కొట్టాలని ఉప ముఖ్యమంత్రి శివకుమార్ వేచి చూస్తున్నారు.

గెలుపే కీలకంగా కమలదళం పావులు

సామ, దాన, భేద, దండోపాయాలను ప్రదర్శించి చెన్నపట్టణను, సండూరు నియోజకవర్గాన్ని తనఖాతాలో వేసుకునేందుకు కాషాయ పార్టీ వేగంగా పావులు కదుపుతోంది. శిగ్గావ్‌లో తమకు పట్టు ఉందని, అక్కడ భరత్ బొమ్మై గెలుపుపై అనుమానం లేదని భాజపా ధీమాతో ఉంది. శిగ్గావ్‌లో గత ఏడాది జనవరి నుంచి భరత్ ఓటర్లతో సమావేశం అవుతూ వచ్చారు. తండ్రిని ఎమ్మెల్యేగా, అనంతరం ఎంపీగా గెలిపించుకునేందుకు తన తల్లితో కలిసి నియోజకవర్గంలోనే ఎక్కువ సమయం గడిపారు. భరత్‌కు మద్దతుగా బొమ్మై, యడియూరప్ప, విజయేంద్ర, జగదీశ్ శెట్టర్, తదితరులు ప్రచారం చేసే అవకాశం ఉంది. సండూరులో మాజీ మంత్రులు గాలి జనార్దన రెడ్డి, బి. శ్రీరాములు సహకారం, గతంలో తమ ఆప్తులు, కార్యకర్తలతో గట్టెక్కవచ్చని భావిస్తోంది. సండూరు నుంచి పోటీ చేయాలని శ్రీరాములు, మాజీ మంత్రి మురుగేశ్ నిరాణి చివరి వరకు ప్రయత్నాలు చేశారు. బంగారు హనుమంతుకు టికెట్ ఇప్పించడంలో గాలి జనార్దన రెడ్డి చక్రం తిప్పారు. బళ్లారిలో ఎంపీ అభ్యర్థి ఎంపికకు వాల్మీకి కార్పొరేషన్ నిధులను వాడారని భాజపా ఇప్పటికే ఆరోపణలు చేసింది. ముడాలో అక్రమాలపై చెన్నపట్టణ నియోజకవర్గం మార్గంలో ఉద్యాననగరి నుంచి రాచనగరి వరకు పాదయాత్రను నిర్వహించింది. తాము చేసిన పోరాటమే సండూరు, చెన్నపట్టణలో గెలుపునకు బాటలు వేస్తుందన్న నమ్మకంతో ఉన్నారు.


చెన్నపట్టణ బొంగరాన్ని తిప్పుతున్న స్థానికుడు

కాంగ్రెస్ అభ్యర్థులెవరు?

రెండు నియోజకవర్గాలకు భాజపా అభ్యర్థులను ప్రకటించి ముందంజలో ఉండగా, కాంగ్రెస్ పార్టీ ఏ క్షణంలో అయినా తన అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో చెన్నపట్టణ నుంచి దళ్ అభ్యర్థిగా కుమారస్వామి, శిగ్గావ్ నుంచి భాజపా అభ్యర్థిగా బొమ్మై, సండూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ఇ.తుకారం గెలిచారు. ఈసారి మూడు నియోజకవర్గాలను తామే దక్కించుకోవాలని భాజపా, కాంగ్రెస్‌లు పోటీ పడుతున్నాయి. సండూరుకు ఇప్పటి వరకు 8 సార్లు ఎన్నికలు జరగ్గా, తుకారాం మూడు సార్లు గెలిచారు. తన కుమార్తె సౌపర్ణిక లేదా భార్య అన్నపూర్ణకు టికెట్ ఇవ్వాలని తుకారాం ఇప్పటికే పార్టీ నేతలను కోరారు. సౌపర్ణికకు టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ నేతలు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. శిగ్గావ్ నుంచి గత ఎన్నికల్లో బొమ్మైపైన కాంగ్రెస్ అభ్యర్థిగా పఠాన్ యాసిర్ రెహమద్ ఖాన్ పోటీ చేశారు. బొమ్మైకు 1,00,016 ఓట్లు (54.95%) రాగా, పఠాన్ యాసిర్‌కు 64,038 (35.18%) ఓట్లు వచ్చాయి. ఈసారి లింగాయత సామాజిక వర్గానికి చెందిన నేతను బరిలో నిలపాలని కాంగ్రెస్ యోచిస్తోంది. నేటి సాయంత్రంలోగా కాంగ్రెస్ తన ముగ్గురు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. మూడు నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మాజీ ముఖ్యమంత్రులు హెచ్‌డీ కుమారస్వామి, బసవరాజ బొమ్మైకు ప్రతిష్ఠగా మారాయి.

అపురూపం.. శ్రీరామాంజనేయం రూపం


రాముని పాదాల వద్ద ఆంజనేయుడు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కర్ణాటకలో అతి పెద్ద శ్రీరామాంజనేయ విగ్రహానికి శ్రీరామసేవా సమితి ప్రతినిధులు ఆదివారం పూజలు చేశారు. గణపతి పూజ, విఘ్నవర్జన ప్రార్థన, దేవతా ప్రార్థన, కలశ ప్రతిష్ఠాపన నేటి (సోమ) నుంచి ప్రారంభం కానున్నాయి. పీఠంతో కలిపి ఈ విగ్రహం 63 అడుగుల ఎత్తు ఉండగా, కర్ణాటకలో ఈ తరహా విగ్రహం ఇదే ఎత్తయినది. విగ్రహ చర ప్రతిష్ఠాపన పూజను, హోమాన్ని సిద్ధగంగ మఠాధిపది సిద్ధలింగ మహాస్వామి చేస్తారు. బుధవారం సాయంత్రం వరకు ప్రతిష్ఠాపన కార్యక్రమం, పూజలు, హోమాలు కొనసాగుతాయని సమితి ప్రతినిధులు తెలిపారు. విగ్రహాన్ని వీక్షించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు, హిందూ సంఘాల కార్యకర్తలు రాజాజీనగర శ్రీరామమందిరం మైదానానికి వచ్చి వెళ్తున్నారు.

సీఐడీ అధికారుల దాడి

కలబురగి, న్యూస్‌టుడే: కర్ణాటక బోవి అభివృద్ధి కార్పొరేషన్‌లో అక్రమాలు జరిగాయని వచ్చిన ఫిర్యాదులతో సీఐడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. భాజపా ఎమ్మెల్సీ సునీల్ వల్యాపుర నివాసంపై ఆదివారం ఉదయం దాడి చేశారు. సునీల్ వల్యాపుర కుమారుడు వినయ్ 2022లో కార్పొరేషన్‌కు చెందిన రూ.12 కోట్లు పక్కదారి పట్టించిన ఆరోపణలు వచ్చాయి. పలు పథకాల్లో తమ వారిని లబ్ధిదారులుగా మార్చి నిధులు మళ్లించడం, తన సోమనాథేశ్వర ఎంటర్‌ప్రైజెస్‌కు మరికొన్ని నిధులు కేటాయించుకున్నారని ఇప్పటికే పలు ఫిర్యాదులు వచ్చాయి. న్యాయస్థానం నుంచి సెర్చ్ వారెంటుతో వచ్చిన అధికారులు కొన్ని దస్త్రాలు, కంప్యూటర్ హార్డ్ డిస్క్, మరి కొన్ని డిజిటల్ దాఖలాలను జప్తు చేసుకుని తమతో తీసుకువెళ్లారు.

సొసైటీలో రూ.19.34 కోట్ల అక్రమాలు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్ర కో-ఆపరేటివ్ సొసైటీలో ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా మదుపు చేసిన నగదులో రూ.19.34 కోట్లు పక్కదారి పట్టాయని మంత్రి కేఎన్ రాజణ్ణ గుర్తించారు. సొసైటీలో 2017 నుంచి 2023 వరకు జరిగిన అక్రమాలపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సొసైటీ నగదును అపెక్స్ బ్యాంకులో డిపాజిట్ చేశారని నకిలీ బాండ్లను అధికారిణి ఆశాలత సృష్టించారని గుర్తించారు. సొసైటీ అధ్యక్షుడు రాజు ఫిర్యాదుతో ఆశాలతతో పాటు ఆరుగురిపై నందిని లేఅవుట్ ఠాణాలో కేసు నమోదైంది.

బాంబు బెదిరింపుతో ఉద్రిక్తత

బెంగళూరు (గ్రామీణం): కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వెళ్లే ఆరు విమానాల్లో 12 మంది ఆత్మాహుతి సభ్యులు ఉన్నారని ఒక వ్యక్తి తన ఎక్స్ కార్ప్ ఖాతాలో ట్వీట్ చేశాడు. మంగళూరు, బెళగావి, తిరువనంతపురం, దుబాయ్, మస్కట్‌లకు వెళ్లే విమానాల్లో బాంబర్లు ఉన్నారని ట్వీట్‌లో నిందితుడు పేర్కొన్నాడు. సమగ్ర సోదాల అనంతరం అది ఉత్తుత్తి బెదిరింపుగా తేల్చారు. దేశవ్యాప్తంగా ఇండిగోకు చెందిన ఆరు విమానాలు, ఎయిర్ ఇండియాకు చెందిన 20 విమానాల్లో బాంబులు ఉన్నాయని వేర్వేరు రాష్ట్రాల్లోని విమానాశ్రయాలకు ఆదివారం బెదిరింపులు వచ్చాయి.

మాదనాయనకహళ్లిలో అమానుషం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: తన వద్ద తీసుకున్న రుణాన్ని పూర్తిగా చెల్లించలేదని ఆరోపిస్తూ రుణం తీసుకున్న వ్యక్తి కుమార్తె (17)పై రవికుమార్ (39) అనే నిందితుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో మాదనాయకహళ్లి ఠాణా పోలీసులు రవికుమార్‌ను అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. స్థానికుడికి నిందితుడు రూ.70 వేల రుణాన్ని ఇచ్చాడు. అందులో రూ.30 వేలను అతను తిరిగి చెల్లించాడు. మిగిలిన రూ.40 వేలు, వడ్డీ తక్షణమే చెల్లించాలని వేధిస్తూ వచ్చాడు. ఇదే క్రమంలో అతని ఇంటికి వచ్చిన సమయంలో బాధితురాలు కనిపించింది. ఆమెకు బలవంతంగా ముద్దు పెట్టి, చరవాణిలో ఫొటో తీసుకున్నాడు. తన కోర్కె తీర్చకపోతే సామాజిక మాధ్యమాల్లో ఫొటో ఉంచుతానని బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు.

వ్యాపారి చరవాణిలో వీడియోల కలకలం

బెళగావి, న్యూస్‌టుడే: భార్య, ఆమె ప్రియుని చేతిలో హత్యకు గురైన భూవ్యాపారి, సామాజిక కార్యకర్త సంతోశ్ పద్మణ్ణనవర (47) చరవాణిలో పలు వీడియోలు ఉన్నాయని పోలీసులు గుర్తించారు. ఆయన నివాసంలోనూ 13 హార్డ్ డిస్క్‌లు, మూడు పెన్‌డ్రైవ్‌లను స్వాధీనపరుచుకున్నారు. వాటన్నింటిలోనూ ఆయన వేర్వేరు మహిళలతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. భర్త తనను పట్టించుకోకుండా ఇతర మహిళలతో పడక పంచుకుంటున్నట్లు ఉమ గుర్తించి, ఫేస్‌బుక్‌లో ఎక్కువ సమయం గడిపింది. అలా పరిచయమైన యువకునితో కలిసి భర్తను హత్య చేయించింది. ఆమె కుమార్తె ఫిర్యాదుతోనే హత్య విషయం బయటకు వచ్చిన విషయం విదితమే.

టికెట్‌కు పోటాపోటీ

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: శిగ్గావ్ టికెట్ తమకే కావాలంటూ కాంగ్రెస్ నేతలు ఆర్ శంక్, ఖాద్రి, శివలీలా కులకర్ణి ఆదివారం ఇక్కడ ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను భేటీ అయ్యారు. వారితో పాటు వచ్చిన కార్యకర్తలు తమ నేతలకు మద్దతుగా నినాదాలు చేశారు. శివకుమార్ అసహనాన్ని ప్రదర్శించారు. 'గొడవ పడేందుకే మా ఇంటి వద్దకు వచ్చారా. టికెట్ ఎవరికి ఇవ్వాలనేది పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుంది. ఎవరికి టికెట్ ఇచ్చినా గెలుపే లక్ష్యంగా పని చేయండి' అని హితవు పలికి వారిని అక్కడి నుంచి పంపించారు.

ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయండి


సిద్ధరామయ్యతో కవితా లంకేశ్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: సీనియరు విలేకరి గౌరీ లంకేశ్ హత్య కేసు విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాలని ఆమె సోదరి కవితా లంకేశ్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఆమె ఆదివారం భేటీ అయి వినతిపత్రాన్ని అందజేశారు. తన సోదరి హత్యకు గురై ఏడేళ్లు దాటిందని, హంతకులను అరెస్టు చేసి, ఆరేళ్లయినా, ఇప్పటి వరకు విచారణ పూర్తి కాలేదని గుర్తు చేశారు. కొందరు నిందితులకు ఇప్పటికే బెయిలు రావడంతో బయటకు వచ్చేశారని తెలిపారు. న్యాయకోవిదులతో పాటు మంత్రివర్గ సమావేశంలో అంశాన్ని చర్చించి తదుపరి నిర్ణయాన్ని తీసుకుంటామని సిద్ధరామయ్య ఆమెకు భరోసా ఇచ్చారు.

సుదీప్‌కు మాతృ వియోగం


తల్లితో సుదీప్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: ఈగ ఫేం నటుడు 'కిచ్చ' సుదీప్ తల్లి సరోజా సంజయ్ ఆదివారం వేకువజామున మరణించారు. వయోసహజ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఆమెను అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె మరణించారు. మాజీ ముఖ్యమంత్రులు బసవరాజ బొమ్మై, యడియూరప్ప, భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర, చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు సుదీప్‌కు సంతాపాన్ని తెలియజేశారు. సుదీప్‌కు తన తల్లితో అనుబంధం ఎక్కువ. తాను ప్రయాణించే అన్ని వాహనాల్లోనూ తల్లితో దిగిన తన ఫొటోను ఉంచుకుంటారు.

పవన్‌కల్యాణ్ సంతాపం

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రముఖ నటుడు కిచ్చా సుదీప్ మాతృమూర్తి సరోజ మృతిపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'సుదీప్ నటజీవితంపై అతని తల్లి ప్రభావం, ప్రోత్సాహం ఉందని ఆయన తెలిపేవారు. మాతృ వియోగం నుంచి ఆయన త్వరగా కోలుకోవాలి. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి' అని పేర్కొన్నారు.

పట్టాలపై బండరాళ్లు

మంగళూరు: ఉళ్లాల సమీపంలోని గణేశనగర తూక్కొట్టు వంతెన వద్ద ట్రాకుపై గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి బండల్ని ఉంచారు. గణేశనగర నుంచి కాపికాడు మధ్య మంగళూరు నుంచి కేరళకు వెళ్తున్న రైలు బండల్ని ఢీకొట్టి పొడి చేస్తూ వెళ్లిపోవడంతో పెద్ద చప్పుడు భయాందోళనకు గురి చేసింది.

సాహితీ సమ్మేళనానికి చక్కెరనాడు సిద్ధం


గోడలపై నినాదాలు రాస్తున్న చిత్రకారులు

మండ్య, న్యూస్‌టుడే: అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనాలకు చక్కెర నాడు మండ్య సిద్ధమవుతోంది. డిసెంబరు 20-22 వరకు నిర్వహించే సమ్మేళనాల్లో సాహితీ వేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు కన్నడ భాష, సాహిత్యాన్ని, ఆహార సంస్కృతి, పండగలు, ఆచార వ్యవహారాలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమ్మేళనాల్లో విస్తృతంగా చర్చిస్తామని కన్నడ సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ మహేశ్ జోషి తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇప్పటికే విడుదలైన నిధులతో రహదారుల్లోని గోడలపై కన్నడ నినాదాలు, సూక్తులు, వచనాలను రాయిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు, బోధకుల సేవలను కూడా సమ్మేళనాలకు వినియోగించుకుంటామన్నారు. సాహిత్య సమ్మేళనాల్లో రాజకీయ నేతల జోక్యం లేకుండా చూడాలని మండ్య జిల్లా సాహితీవేత్తలు, రచయితల సంఘం ప్రతినిధులు జోషికి వినతి పత్రాన్ని అందజేశారు.

ఉద్యాన నగరిపై వరుణాస్త్రం


మైసూరు రోడ్డులో నిలిచిన వర్షం నీరు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: శివమొగ్గ, చిక్కమగళూరు జిల్లాల్లో భారీ వర్షాలు కొనసాగాయి. పూలు, పండ్ల తోటలు, వక్క, కొబ్బరి తోటలు దెబ్బతిన్నాయి. పట్టణాలు- గ్రామాలను అనుసంధానం చేసే చిన్న వంతెనలు వరద నీటిలో మునిగాయి. చిక్కమగళూరు దత్తపీఠం రోడ్డులో 3 అడుగుల ఎత్తులో నీరు నిలిచింది. నేడు కూడా ఈ రెండు జిల్లాల్లో భారీ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. ఇప్పటికే ఆయా జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు, జలాశయాలు పూర్తిగా నిండాయి. బెంగళూరులో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు రహదారులు జలమయం అయ్యాయి. మైసూరు రోడ్డు, కెంగేరి, మడివాళ, రూపేన అగ్రహార, జైరామ్ కూడలి, యలహంకల్లో రహదారుపై నీరు నిలిచింది. నేటి (సోమ) నుంచి వారం పాటు మల్నాడు, తీర ప్రాంత జిల్లాలు, బళ్లారి, విజయనగర, దావణగెరె, చిత్రదుర్గ, చిక్కబళ్లాపుర, తుమకూరు, కోలారు, దావణగెరె జిల్లాల్లో ఎల్లో అలర్ట్ ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.


మైసూరు రోడ్డులో వాననీటిలో మునిగిన బస్సు, లారీ తదితర వాహనాలు

'సీఎం పదవి పోతుందని సిద్ధుకు భయం'


తండ్రి బొమ్మైతో కలిసి యడియూరప్పను సత్కరిస్తున్న భరత్

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు తన అధికారం, పదవి పోతుందని భయం పట్టుకుందని ఎంపీ, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై ఎద్దేవా చేశారు. విపక్షాలపై ఆరోపణలు చేయడం, కేసుల విచారణ పేరిట సమితుల ఏర్పాటు అంటూ పరోక్షంగా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇదే భయంతో తాము త్వరలో కులగణన నివేదికను విడుదల చేస్తామని కొత్త నాటకానికి తెరతీశారని దుయ్యబట్టారు. మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పను తన కుమారుడు భరత్‌తో కలిసి ఆదివారం భేటీ అయ్యారు. యడ్డీని సత్కరించి, తన కుమారుని గెలుపునకు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం తనను కలుసుకున్న విలేకరులతో మాట్లాడారు. కుల గణన నివేదికకు సంబంధించి అఖిలభారత వీరశైవ మహాసభ జాతీయ అధ్యక్షుడు శామనూరు శివశంకరప్ప తనను భేటీ అయ్యారని చెప్పారు. ప్రభుత్వం దగ్గర ఉన్నది కుల గణన కాదని, సామాజిక, ఆర్థిక సమీక్ష అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలకు కులగణన చేసే అధికారం కలిగి ఉండవన్నారు. బిహార్ ప్రభుత్వం చేయించిన కులగణన నివేదికను ప్రాధాన్యత ఉండదని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. వెనుకబడిన వర్గాల కమిషన్ అధ్యక్షుడిగా ఉన్న కాంతరాజు నేతృత్వంలోని ప్రతినిధులు పదేళ్ల క్రితం చేసిన సమీక్షను ఇప్పుడు ఎలా వినియోగించుకుంటారని ప్రశ్నించారు. ఈ నివేదికను ఇప్పటికే ఒక్కలిగ సముదాయం నేతలు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యతిరేకించారని గుర్తు చేశారు. అఖిలభారత వీరశైవ మహాసభ వ్యతిరేకించిన ఈ నివేదికను జారీ చేయడం సాధ్యం కాదన్నారు. నివేదికలోని అంశాలను బహిరంగ పరచి, దానిపై బహిరంగ చర్చకు అనుమతించాలని ముఖ్యమంత్రికి సూచిస్తానని చెప్పారు. వీపీ సింగ్ ప్రధానిగా తన పదవి పోతుందని తెలిసినప్పుడు మండల్ కమిషన్ నివేదికను జారీ చేశారని, ఇప్పుడు ఇక్కడ సిద్ధరామయ్య కుల గణన నివేదికను జారీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు.

కక్షపూరిత రాజకీయాలు

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ఆయన సోదరుడు గోపాల్ జోషికి సంబంధం లేకపోయినా ముఖ్యమంత్రి, ఇతర నాయకులు కక్షపూరిత రాజకీయాలకు తెర లేపారని బొమ్మై ఆరోపించారు. వారిద్దరి మధ్య గత 32 ఏళ్లుగా ఎలాంటి సంబంధాలు లేవని గుర్తు చేశారు. గోపాల్ జోషి వంచనకు పాల్పడితే చట్టం శిక్షిస్తుందని, దానికి ప్రహ్లాద్ జోషి బాధ్యుడు ఎలా అవుతారని ప్రశ్నించారు.

పబ్లిక్ పరీక్షలు ఉండవు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కర్ణాటకలో 5, 8, 9, 11వ తరగతులకు బోర్డు పరీక్షలను నిర్వహించకూడదని నిర్ణయించామని విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప తెలిపారు. ఈ తరగతులకు బోర్డు (పబ్లిక్) పరీక్షలను నిర్వహించాలని గత ఏడాది ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. పబ్లిక్ పరీక్షల నిర్వహణ నిర్ణయాన్ని న్యాయస్థానం ప్రభుత్వానికే వదిలిపెట్టింది. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తల నుంచి వచ్చిన విన్నపాలను పరిగణనలోకి తీసుకుని ఆ తరగతులకు విద్యాసంస్థల్లో నిర్వహించే పరీక్షలే సరిపోతాయని ఈ నిర్ణయానికి వచ్చామని మధు బంగారప్ప తెలిపారు.

రెండు గంటలే అవకాశం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ఈ ఏడాది దీపావళి పండగ రోజు రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే బాణసంచా కాల్చేందుకు అవకాశం కల్పిస్తున్నామని పర్యావరణ, అటవీ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే తెలిపారు. కాలుష్యకారకం కాని హరిత బాణసంచా విక్రయాలకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. పెద్ద చప్పుడు, వెలుగులు, పొగను వెలువరించే బాణసంచా విక్రయించినా, కాల్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణసంచా విక్రయాలకు అనుమతి తీసుకునే వారి నుంచి హరిత బాణసంచా మాత్రమే విక్రయిస్తామని ముందస్తు హామీ పత్రాన్ని తీసుకుంటామని స్పష్టం చేశారు.

డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారు

గదగ, న్యూస్‌టుడే: త్వరలోనే డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని నొణవినకెరె కాడసిద్ధేశ్వర మఠాధిపతి కరివృషభ రాజదేశికేంద్ర శివయోగీశ్వర శివాచార్య స్వామి పేర్కొన్నారు. లక్ష్మేశ్వర ముక్తి మందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముక్తి మందిరంలో త్రికోటి లింగ ప్రతిష్ఠాపనలో జాప్యం జరుగుతోందన్నారు. త్వరలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే శివకుమార్ త్రికోటి లింగ ప్రతిష్ఠాపన చేస్తారని తెలిపారు. ముడాలో అక్రమాలకు సంబంధించి ముఖ్యమంత్రి స్థానానికి రాజీనామా చేయాలని విపక్ష నేతలు డిమాండ్ చేయడం, మరో వైపు ఈడీ దర్యాప్తు తదితర పరిణామాలు జరుగుతున్న ఈ సమయంలో శివాచార్య స్వామి వ్యాఖ్యలు ప్రత్యేకత సంతరించుకున్నాయి.

'గాలి నోటిని అదుపులో పెట్టుకో'

బళ్లారి, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, గ్రామీణ ఎమ్మెల్యే బి.నాగేంద్రపై అవినీతి ఆరోపణలు చేయడమే కాకుండా డస్ట్‌బిన్ అంటూ తిట్టిన గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి తన నోరు అదుపులో పెట్టుకోవాలని జిల్లా దళిత, వెనుకబడిన వర్గాల ఐక్యత సమితి సభ్యులు, కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఉదయం నగరంలో వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో ఉన్న వాల్మీకి, దళిత, వెనుకబడిన వర్గాల ప్రజలను అవమానపరిచేలా జనార్దన్‌రెడ్డి మాట్లాడటం దారుణమన్నారు. కొప్పళ జిల్లాలో మంత్రి శివరాజ్ తంగడి, గంగావతిలో మాజీ మంత్రి ఇక్బాల్ అన్సారీలను ఇలాగే మాట్లాడి అవమానపరిచారని మండిపడ్డారు. గాలి ఈ స్థాయికి రావడానికి ప్రధాన కారణం వాల్మీకి సముదాయమేనని మరిచిపోకూడదని అన్నారు. మాజీ మంత్రి నాగేంద్ర తప్పుచేస్తే న్యాయస్థానాలు, దర్యాప్తు సంస్థలు ఉన్నాయన్నారు. గాలి రాజకీయాల్లో రాకముందు ఏం చేశారో, ఆయన తండ్రి ఏం చేశారో తెలుసుకోవాలన్నారు. ఎన్నోబుల్ ఇండియా అనే కంపెనీ స్థాపించి ప్రజల నుంచి డబ్బు దోచుకోవడంతో క్రిమినల్ కేసు నమోదైన విషయం తెలియదా అన్నారు. ఆ సమయంలో ఆయనను కాపాడింది వాల్మీకి సంఘం నేతలేనని గుర్తు చేసుకోవాలన్నారు. గనులు లూటీ చేయడంతో పలువురు వీధి పాలయ్యారని, తన ఇంటి చుట్టుపక్కల వారి నివాసాలను ఖాళీ చేయించారని, ఓబుళాపురం గనుల్లో ఉన్న సంకలమ్మ దేవస్థానాన్ని కూల్చి వేశారని ఆరోపించారు. సండూరు నియోజకవర్గ ఉప ఎన్నికల్లో భాజపాకు ఓటమి తప్పదన్నారు. రాబోయే బళ్లారి ఎన్నికల్లో గాలి, ఆయన కుటుంబ సభ్యులను ఓడించి చెత్తబుట్టలోకి వేసే శక్తి వాల్మీకి సముదాయానికి ఉందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రాంప్రసాద్, మానయ్య, గాదిలింగనగౌడ, మేయర్ ముల్లంగి నందీష్, చిదానందప్ప, హుమాయూన్‌ఖాన్, ముదిమల్లయ్య, పరశురాం, నాగరాజ్, ఆయాజ్ అహమ్మద్, గోవాల్ నాగభూషణగౌడ, పద్మావతి, బెణకల్లు బసవరాజగౌడ, రవికుమార్, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాంప్రసాద్, మానయ్య, నందీష్, హుమాయూన్‌ఖాన్, గాదిలింగనగౌడ తదితరులు


దేశభక్తి గేయానికి నృత్యం


విద్యార్థినుల సంప్రదాయ నృత్యం

అలరించిన తింగళ సొబగు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి కన్నడ సంస్కృతి, సాంస్కృతిక సమచ్ఛాయ నిర్వహణ సమితి కలిసి శనివారం రాత్రి స్థానిక డా.రాజ్‌కుమార్ రహదారిలోని నాదోజ సుబ్బద్రమ్మ మన్సూరు బయలు రంగమందిరంలో నిర్వహించిన 'తింగళ సొబగు' విశేషంగా ఆకట్టుకుంది. కన్నడ సంస్కృతి శాఖాధికారి నాగరాజ ప్రారంభించి మాట్లాడారు. కళాకారులను ప్రోత్సహించడానికి ప్రతి నెలా కన్నడ సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాకారుల్లో దాగిన ప్రతిభను వెలుగులో తేవడానికి ఇది మంచి వేదికగా ఉందన్నారు. ప్రాచీన కళలను ఆదరించి కళాకారులను వెన్నుతట్టి ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం హులుగప్ప నేతృత్వంలో జానపద గీతాలాపన, సంగీతం, వివిధ కళాకారుల బృందాలు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యాలు, జానపద నృత్యం, కోలాటం విశేషంగా ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో ప్రేక్షకులు, విద్యార్థులు హాజరయ్యారు.


జానపద సంగీతాలపన

గందరగోళాన్ని ఎదుర్కొంటున్నారు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: సుభిక్షంగా లేని ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైపు ఉండాలా, ఉప ముఖ్యమంత్రి వైపు ఉండాలా అనే విషయంలో వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి గందరగోళాన్ని ఎదుర్కొంటున్నారని విపక్ష నాయకుడు అశోక్ ఎద్దేవా చేశారు. ఎక్స్‌లో ఉన్నప్పటి నుంచి తన పాత మిత్రుడు సిద్ధరామయ్యకు మద్దతు ఇవ్వాలా శివకుమార్ ముఖ్యమంత్రి అయితే తన మంత్రి పదవి కాపాడుకునేందుకు ఆయనకు మద్దతు ఇవ్వాలా అని సతమతం అవుతున్నారని విమర్శించారు. రైతుల హితాన్ని కాపాడితే, మంత్రి పదవి ఎక్కువకాలం పోదని హితవు పలికారు. ప్రభుత్వ వైఫల్యాలను విపక్షాలు ఎండగడితే ఉలిక్కిపడుతున్నారు, ప్రజా సమస్యలను పరిష్కరించడం మాని ఎదురుదాడి చేస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదని తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు.

వంచకుడి కోసం గాలింపు

బెంగళూరు (యలహంక): పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై పదేపదే అత్యాచారానికి పాల్పడి పరారైన నిందితుడి కోసం కొడిగేహళ్లి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అత్యాచారానికి గురైన 22 ఏళ్ల యువతి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి, నిందితుడు ఇద్దరు ఒకే దగ్గర పని చేస్తున్నారు. స్నేహం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు యువతి ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

డిసెంబరు 20న 'యూఐ' రాక

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ప్రముఖ సినీనటుడు ఉపేంద్ర నటిస్తున్న 'యూఐ' చిత్రం డిసెంబరు 20న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళం, హిందీ భాషల్లో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు జి.మనోహరన్, కేపీ శ్రీకాంత్ తెలిపారు. విభిన్నమైన కథలో హీరోగా ఉపేంద్ర నటిస్తుండటంతో ప్రేక్షకులు విడుదల కోసం ఎదురు చూస్తున్నారని తెలియజేశారు. చిత్రానికి సంబంధించిన పోస్టర్ ఇటీవల విడుదల చేశారు. ఉపేంద్రతో పాటు రీష్మా నాణయ్య హీరోయిన్‌గా నటిస్తున్నారు.



ఉపేంద్ర నటిస్తున్న యూఐ చిత్రం పోస్టర్ విడుదల

25న 'యలాకున్ని' విడుదల

ప్రముఖ హాస్యనటుడు కోమల్ కుమార్ నటిస్తున్న 'యలాకున్ని' చిత్రం ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. సౌందర్య సినీ కంబైన్స్, నరసింహ సినిమాస్ బ్యానర్లపై అనుసూయ కోమల్‌కుమార్, సహనమూర్తి నిర్మిస్తున్న చిత్రానికి కోమల్‌కుమార్ చిత్రకథతో పాటు సాహిత్యం, దర్శకత్వం వహిస్తున్నారు. ఆకర్ష, నిసర్గ అప్పణ్ణ, యతిరాజ్, జయసింహ ముసురి,మయూర్ పటేల్, సాధుకోకిల, దత్తణ్ణ, మిత్ర, తబలనాణి, శివరాజ్‌కె.ఆర్. పేట, మానసిసుధీర్ సుమన్‌నగరకర్ తదితరులు నటిస్తున్నారు.


యలాకున్ని చిత్రంలో కోమల్‌కుమార్, ఆకర్ష

'అభిమన్యు సన్‌ఆఫ్ కాశీనాథ్' చిత్రీకరణ

కన్నడ హాస్యనటుడు కాశీనాథ్ కుమారుడు అభిమన్యు కాశీనాథ్ తొలిసారిగా ముఖానికి రంగు వేసుకుని నటిస్తున్న 'అభిమన్యు ఎస్‌వో' చిత్రం చిత్రీకరణ ప్రారంభమైంది. సహకార నగరలో జరిగిన చిత్రీకరణ సందర్భంగా నటీనటులపై హీరో కోమల్‌కుమార్ క్లాప్ ఇచ్చారు. హాస్యభరితమై చిత్రానికి రాజ్ మురళి దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్లుగా స్పందన సోమణ్ణ, విజయలక్ష్మీ కలబురగి నటిస్తున్నారు. చిక్కమగళూరు, హైదరాబాద్, మైసూరు తదితర ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరిస్తారు.


అభిమన్యు సన్‌ఆఫ్ కాశీనాథ్ చిత్రంలో అభిమన్యు, స్పందన సోమణ్ణ, విజయలక్ష్మీ కలబురగి

'రాజు జేమ్స్‌బాండ్' సిద్ధం

హాస్యభరితమైన 'రాజు జేమ్స్‌బాండ్' చిత్రం విడుదలకు సిద్ధమైంది. దీపక్ మధువనహళ్లి దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో గురునందన్, మృదులా, సాధుకోకిల, అచ్యుత్‌కుమార్, చిక్కణ్ణ, రవిశంకర్, జైజగదీశ్ తదితరులు నటిస్తున్నారు. థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకుడు రెండుగంటల పాటు నవ్వులతో మునిగిపోతారని, ఆవిధంగా చిత్రాన్ని నిర్మించినట్లు దర్శకుడు తెలిపారు.


రాజు జేమ్స్‌బ్రాండ్ చిత్రంలో గురునందన్, మృదులా

అందాల గిరి.. ఆహ్లాదాల పందిరి

➠ పర్వతారోహణకు యువత ఉత్సాహం ➠ కుదురెముఖ్‌లో మళ్లీ ట్రెక్కింగ్ ప్రారంభం


పచ్చిగడ్డి మధ్య యువతీ యువకుల సంచారం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: పడమటి కనుమల్లోని కుదురెముఖ్ అటవీ ప్రాంతంలో మళ్లీ పర్వతారోహణ (ట్రెక్కింగ్) ప్రారంభమైంది. కురుస్తున్న చినుకుల మధ్య అధిరోహణ చేస్తే అనుభూతి వేరుగా ఉంటుందని యువత అభిప్రాయం. ట్రెక్కింగ్ చేసేందుకు బెంగళూరు, మైసూరు, బెళగావి, బళ్లారి తదితర ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు ఎక్కువ మంది తమ పేర్లను అటవీ శాఖ అంతర్జాలంలో నమోదు చేసుకుంటున్నారు. మొన్నటి వరకు కురిసిన వర్షాల కారణంగా అటవీ శాఖ అధికారులు కొద్దిరోజులు పర్వతారోహణ నిలిపివేసి మళ్లీ ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన యువత తమ పేర్లు నమోదు చేసుకునేందుకు ముందంజలో ఉన్నట్లు తెలియజేశారు. రోజుకు మూడువందల మంది ట్రెక్కింగ్ నిర్వహించేందుకు అనుమతిస్తున్నారు. సాధారణంగా రెండువందల మందికి అవకాశం కల్పిస్తుండగా పెరుగుతున్న ఒత్తిడి కారణంగా సంఖ్యను పెంచినట్లు కుదురెముఖ్ వన్యజీవి విభాగం అటవీ అధికారి హరీశ్ తెలిపారు. మూడు వందల మంది కన్నా ఎక్కువ మందిని అనుమతించబోమన్నారు. ట్రెక్కింగ్‌కు వచ్చే వారి కోసం సంసె గ్రామం వద్ద 30 హోం స్టేలను ఏర్పాటు చేశారు. అక్కడ బయలు ప్రదేశంలో స్లీపింగ్ బ్యాగుల్లో నిద్రించే విధంగా పెద్ద గదులను స్త్రీ, పురుషులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. చిక్కమగళూరు జిల్లా పర్వత శ్రేణిలోని కలసా నుంచి 20 కిలోమీటర్ల దూరంలో కుదురెముఖ్ పర్వతాలు ప్రారంభమవుతాయి. సంపే పర్వత ప్రదేశం నుంచి ట్రెక్కింగ్ ప్రారంభించేందుకు అనుమతిస్తారు. 22 కిలోమీటర్ల వరకు చేయవచ్చును. పర్వత శిఖరాలు 1894 మీటర్ల ఎత్తులో ఉన్నాయి. అవి ఏటవాలుగా ఉండి దట్టమైన గడ్డి, పొగమంచుతో కప్పేశాయి. మేఘాలు పర్వతాలను తాకుతూ ముందుకు సాగుతాయి. నిత్యం తుంపర జల్లులు కురుస్తుండటంతో ప్రకృతి అందాలు కన్నువిందు చేస్తున్నాయి. అందువల్ల ఏటా 7000 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదవుతుంది. కుదురెముఖ పర్వతాల నుంచి తుంగ, భద్ర, నేత్రావతి నదులు పుట్టి కిందకు ప్రవహిస్తున్నాయి. ప్రకృతి సహజంగా ఏర్పడిన పచ్చికతో కూడిన పర్వతాల్లో సంచరించేందుకు ప్రకృతి ప్రేమికులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ట్రెక్కింగ్ వెంట అటవీ శాఖ సిబ్బంది, గైడ్ తదితరులు ఉంటు అనునిత్యం గమనిస్తుంటారు. అనారోగ్యం పాలైతే అప్పటికప్పుడు ప్రాథమిక చికిత్స అందిస్తారు. ఆ సమయంలో ఆసుపత్రికి తరలించడానికి వాహనాలను అందుబాటులో ఉంచుతారు. సురక్షితంగా ట్రెక్కింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.


ట్రెక్కింగ్ చేసేందుకు వచ్చిన వివిధ ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు


కుదురెముఖ్ పర్వత శ్రేణిలో ట్రెక్కింగ్ చేస్తున్న పరిసర ప్రేమికులు


రాత్రి బస చేసేందుకు హోం స్టేల ముందు ఏర్పాటు చేసిన గుడారాలు


పచ్చగడ్డితో కప్పేసిన కుదురెముఖ్ పర్వత శ్రేణులు

దొరకని హెడ్‌కానిస్టేబుల్ ఆచూకీ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: మీ పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మహిళను నమ్మించి ఆమె వద్ద రూ.47లక్షలు నగదు, 857 గ్రాముల బంగారు నగల తీసుకుని మోసగించి, అడిగితే హత్య చేస్తానని బెదిరించి పరారీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు అతడి ఇద్దరి స్నేహితుల కోసం నందినిలేఔట్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. చామరాజపేట సీఏఆర్ విభాగం హెడ్‌కానిస్టేబుల్ ప్రశాంతకుమార్ అతడి అనుచరులు ప్రశాంత్, దీపా కోసం గాలిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. తాను ఏడీజీపీ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నానని, ఇద్దరి పిల్లలకు ప్రభుత్వోద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి తనను మోసగించారని సుందర భాగ్య నందినిలేఔట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దశలవారీగా తన వద్ద నగదు, బంగారు నగలు తీసుకుని ఉద్యోగాలు ఇప్పించలేదన్నారు. నగదు, నగలు ఇవ్వాలని అడిగితే హత్య చేస్తానని బెదిరించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

సినీ దర్శకుడిపై ఫిర్యాదు

బెంగళూరు(యశ్వంతపుర): పుస్తకాలు, సీడీలు కొనుగోలు చేసి నగదు చెల్లించలేదన్న ఆరోపణపై కన్నడ సినీ దర్శకుడు గురుప్రసాద్‌కు వ్యతిరేకంగా జయనగర పోలీసులు కేసు నమోదు చేశారు. 2019లో జయనగర టోటల్ కన్నడ దుకాణానికి వచ్చి రూ.69 వేల విలువ చేసే పుస్తకాలు, సీడీలను కొనుగోలు చేసి నగదు చెల్లించలేదని యజమాని లక్ష్మీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగదు చెల్లించాలని తాను పలుమార్లు అడిగినా సమాధానం ఇవ్వలేదని, ఇంటికి వెళ్లే చిరునామా మారినట్లు తెలిపారు. ఇక లాభం లేదని పోలీసులను ఆశ్రయించినట్లు తెలియజేశారు.

చామంతి ధరలు తగ్గుముఖం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: శరన్నవరాత్రులు ముగిసిన అనంతరం చామంతి పూల ధరలు పాతాళానికి పడిపోయాయి. పండగ సమయంలో కిలో రూ.20 వరకు పలికిన చామంతి ప్రస్తుతం కిలో ఒక రూపాయికి చేరుకుంది. పలువురు రైతులు మార్కెట్‌కు పూలు తీసుకురాకుండా, మొక్కలకే వాటిని వదిలి వేస్తున్నారు. అవసరం ఉన్న వారు చామంతిని కోసుకు వెళ్లాలని సూచిస్తున్నారు. దీపావళి సమయానికి ధర కాస్త పెరుగుతుందని కొందరు సాగుదారులు ధీమాతో ఉన్నారు.

పంట నష్టం వివరాల సేకరణ

కారటగి, న్యూస్‌టుడే: కారటగి తాలూకాలో మూడు రోజులు కురిసిన వర్షానికి బూగుంప, తిమ్మాపుర, హాలసముద్ర, బెన్నూరు, కక్కరగోళ, నందిహళ్లి తదితర గ్రామాల శివారుల్లో వేసిన వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని తహసీల్దార్ ఎం.కుమారస్వామి తెలిపారు. ఆయన ఆదివారం కారటగిలో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి కారటగి, సిద్ధాపుర ఫిర్కాల్లోని గ్రామాల శివార్లలో శనివారం నుంచి పంట నష్టం వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక అంచనా మేరకు 445 ఎకరాల్లో పంట నాశనమైందన్నారు. నష్టం వివరాల నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. కారటగి పట్టణంలో రెండు ఇళ్లు దెబ్బతిన్నాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని వెల్లడించారు.


కంప్లి: వరిని తాళ్లతో కట్టి నిలబెడుతున్న కూలీలు

కంప్లి తాలూకాలో..: తాలూకాలోని సణాపుర, బెళగోడు, ముద్దాపుర, బసవేశ్వర క్యాంపు, మణ్ణూరు-సూగూరు తదితర నదీ తీర ప్రాంత గ్రామాల్లో చేతికొచ్చిన వరి పంట నేల కొరిగింది. పడిపోయిన పంటను రైతులు తాళ్లతో కట్టి నిలబెడుతున్నారు. గింజలు రాలి పంట దిగుబడి తగ్గుతుందని అన్నదాతలు వాపోయారు. నష్టం వివరాలు సేకరించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.


కారటగి: హాలసముద్ర శివారులో నేల కొరిగిన

కుటుంబానికి తప్పిన ప్రాణాపాయం

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: హిరియూరు పట్టణంలో కురిసిన వర్షానికి గుడిసె కూలిపోవడంతో ఓ కుటుంబం చిన్నపాటి గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులు విలేకరులకు వివరాలు తెలిపారు. పట్టణంలోని మిర్జానగర్‌లో ఉంటున్న షహీన్ కుటుంబం శనివారం రాత్రి భోజనం చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి జోరుగా వర్షం కురవడంతో చినుకుల శబ్దానికి మేల్కొన్నారు. కొద్దిసేపటికి ఈదురుగాలులకు ఇంటి పైకప్పు కదలడం ప్రారంభించింది. భయపడిన కుటుంబ సభ్యులు గుడిసె నుండి బయటకు పరుగెత్తుకొంటూ వచ్చారు. కొన్ని క్షణాలకే గుడిసె నేలమట్టమైంది. షహీన్, ఆమె కుమార్తె పర్వీన్ బాను తదితరులు స్వల్పంగా గాయపడ్డారు. గుడిసె కూలడంతో నిరాశ్రయులుగా మారిన కుటుంబం ప్రభుత్వాన్ని సాయం కోరుతోంది.


నిరాశ్రయులుగా మారిన తల్లీకూతుర్లు షహీన్, పర్వీన్‌బాను

55 గృహాలు ధ్వంసం: హిరియూరు తాలూకాలో శనివారం కురిసిన భారీ వర్షాలకు 15 గృహాలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. చెళ్లకెర తాలూకాలో 10, చిత్రదుర్గంలో 16, హొళల్కెరెలో 8, హొసదుర్గంలో 4, మొళకాల్మూరులో 2 చొప్పున మొత్తం 55 ఇళ్లు ధ్వంసమైనట్లు అధికారులు వెల్లడించారు.

గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాను

మైసూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి ముడాకు చెందిన 20 గుంటల భూమి (అర ఎకరం)ని 2023 సెప్టెంబరు 29న రిజిస్ట్రార్ ద్వారా తన పేరిట మార్పించుకున్నారని సహ కార్యకర్త గంగరాజు ఆరోపించారు. దీనిపై తాను గవర్నర్ గహ్లోత్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ దీనిపై తాను ముడా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదని చెప్పారు. తన వద్ద ఉన్న దాఖలాను అందించేందుకు సమయం ఇవ్వాలని గవర్నర్ కార్యాలయం అధికారులను ఇప్పటికే కోరానని తెలిపారు. ఇప్పుడు కొన్ని దాఖలాలను సరి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

పితృవియోగంతో కొడుకు ఆత్మహత్య

హొసపేటె, న్యూస్‌టుడే: తండ్రి మరణాన్ని తట్టుకోలేక తీవ్ర మనస్తాపంతో కొడుకు గోరేశ్‌నాయక్ (40) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం కూడ్లిగి తాలూకా పూజారహళ్లి తండాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పది రోజుల క్రితం నాగేంద్రనాయక్ అనే వ్యక్తి కుటుంబ కలహాలతో వేసారి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తండ్రి మరణించిన బాధ తట్టుకోలేక కొడుకు గోరేశ్‌నాయక్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని బలవన్మరణం చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై కానాహొసహళ్లి ఠాణా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లారీ దూసుకెళ్లి 55 గొర్రెల మృతి

హొసపేటె, న్యూస్‌టుడే: మందపై లారీ దూసుకెళ్లడంతో 55 గొర్రెలు మృతి చెందగా, మరో తొమ్మిది తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం కూడ్లిగి తాలూకా శివపుర సమీపంలోని 50వ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూడ్లిగి తాలూకా శివపుర గొల్లరహట్టికి చెందిన యరెప్ప గొర్రెలు మేపుకుని ఇంటికి బయల్దేరారు. అదే సమయంలో చిత్రదుర్గం వైపు వెళుతున్న లారీ గొర్రెల మందపై దూసుకెళ్లింది. 55 గొర్రెలు అక్కడికక్కడే చనిపోయాయి. మొత్తం రూ.11 లక్షలు నష్టం వాటిల్లినట్లు యరెప్ప వాపోయారు. మందపై దూసుకెళ్లిన లారీ అదే వేగంతో రోడ్డు విభాజకాన్ని ఢీకొని నిలిచి పోయింది. ప్రమాదంలో చోదకుడు ప్రేమ్‌సింగ్, సహాయకుడు రామ్ మిలన్ గాయపడ్డారు. కూడ్లిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సండూరులో విజయం తథ్యం

నేటి నుంచి ప్రచారం ప్రారంభం

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు విధానసభ క్షేత్రం ఉపఎన్నికకు భాజపా అభ్యర్థిగా బంగారు హనుమంతకు అధిష్ఠానం టికెట్ ప్రకటించి నిజమైన కార్యకర్తకు న్యాయం చేశారని మాజీ మంత్రి శ్రీరాములు అన్నారు. నగరంలోని పార్టీ కేంద్రీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉప ఎన్నికకు మరో 25 రోజుల సమయం ఉందని, బూత్ స్థాయి నుంచి భాజపాకు మద్దతు లభిస్తోందన్నారు. 1999 నుంచి జిల్లాలో భాజపా పుంజుకుందని, సోమవారం నుంచి మాజీ మంత్రి జనార్దన్‌రెడ్డి నేతృత్వంలో ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ప్రజలు ఆ పార్టీపై ఆగ్రహంతో ఉన్నారన్నారు. భాజపా అభ్యర్థి హనుమంత గెలుపుపై ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ ఉప ఎన్నికలో కమలం వికసించడం తథ్యమన్నారు. వాల్మీకి కార్పొరేషన్‌కు చెందిన రూ.21 కోట్ల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికలకు ఖర్చు చేసిందన్నారు. నాగేంద్ర స్వాతంత్ర్య పోరాటంలో జైలుకు వెళ్లి విడుదలైన విధంగా ఊరేగింపుగా వచ్చారని విమర్శించారు. సమావేశంలో మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి, అభ్యర్థి బంగారు హనుమంత, మాజీ ఎమ్మెల్యేలు గాలి సోమశేఖర్‌రెడ్డి, సురేష్‌బాబు తదితరులు మాట్లాడారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమై పలు సూచనలు చేశారు. సండూరు ఉప ఎన్నికలో ఏవిధంగా ప్రచారం చేయాలి, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ అవినీతిని ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రులు శ్రీరాములు, గాలి జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు తదితరులు

బళ్ళారి
• బళ్ళారి • రాయచూరు

26 నుంచి ఏఐయూటీయూసీ సమ్మేళనం

బళ్లారి, న్యూస్‌టుడే: ఏఐయూటీయూసీ నాలుగో రాష్ట్ర స్థాయి సమ్మేళనం 26 నుంచి రెండు రోజుల పాటు మైసూరులో జరగనుందని, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవదాసు కోరారు. రాష్ట్రస్థాయి సమ్మేళనం నేపథ్యంలో ఆదివారం బళ్లారి తాలూకాలోని బెళగల్లు, జానెకుంటె, హరగిన డోణి, కుడతిని తదితర గ్రామాల్లో జాతాలు చేపట్టారు. వాటిని అధ్యక్షుడు దేవదాసు, ఉపాధ్యక్షుడు, న్యాయవాది సోమశేఖర్‌గౌడ ప్రారంభించి మాట్లాడారు. సమ్మేళనానికి జిల్లా నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పలు నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. 26న సాయంత్రం మైసూరులో నిర్వహించే బహిరంగ సమావేశానికి కార్మికులు హాజరుకావాలని కోరారు. జాతాలో సభ్యులు డా. ప్రమోద్, శాంత, శర్మస్, రాజ, కిరణ్‌కుమార్, మహేష్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆర్‌ఎస్‌ఎస్ కవాతు



సింధనూరు తాలూకా గాంధీనగర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కవాతు కనువిందు చేసింది. స్థానిక శివ పంచాయతన క్షేత్రం నుంచి ఆరంభమైన కవాతు క్యాంపులోని ప్రధాన వీధుల గుండా సాగి తిరిగి శివాలయానికి చేరుకుంది. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ క్యాంపులో మూడు రోజుల బైటక్ జరిపింది.
-న్యూస్‌టుడే, గాంధీనగర్ (సింధనూరు)

భాజపా గాలి వీచేనా

• హనుమంతుకు సండూరు టికెట్ • అసంతృప్తులను బుజ్జగిస్తున్న నేతలు



భాజపా అభ్యర్థి బంగారు హనుమంత

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లాలోని సండూరు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో భాజపా అభ్యర్థిగా స్థానిక నాయకుడు బంగారు హనుమంతుకు మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి పార్టీ అధిష్ఠానం నుంచి టికెట్ ఇప్పించారు. మరోవైపు హనుమంత భాజపా రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి, మాజీ మంత్రి అశ్వత్థనారాయణకు దగ్గరయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్‌లోనూ ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉండటంతో పార్టీ అధిష్ఠానం బంగారు హనుమంత వైపు మొగ్గు చూపిందని చర్చించుకుంటున్నారు. సండూరు విధాన సభ క్షేత్రం నుంచి టికెట్ కోసం మొదటి నుంచి ప్రయత్నాలు చేస్తున్న కేఎస్ దివాకర్‌కు చుక్కెదురైంది. వాల్మీకి సముదాయంలో ప్రత్యేక గుర్తింపు, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటున్న బంగారు హనుమంతుకు టికెట్ ఇప్పించి గెలిపిస్తే తనకు పార్టీలోనే కాకుండా వాల్మీకి సముదాయంలో పూర్వ వైభవం వస్తుందని గాలి జనార్దన్‌రెడ్డి మద్దతు ఇచ్చారు.

వాల్మీకి సముదాయానికి దగ్గరవడానికి..

జిల్లా రాజకీయంలో కీలకంగా ఉన్న గాలి జనార్దన్ రెడ్డికి వాల్మీకి సముదాయంలో ప్రత్యేక గుర్తింపు పొందిన బి.శ్రీరాములు, బి.నాగేంద్ర, సణ్ణ పక్కీరప్ప, జె.శాంత, సురేష్‌బాబుల మద్దతు ఉండేది. ప్రస్తుతం బి.నాగేంద్ర కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి బి.శ్రీరాములుతో అనుకున్న స్థాయిలో సంబంధాలు లేవు. మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు, మాజీ ఎంపీ సణ్ణ పక్కీరప్ప దూరంగా ఉంటున్నారు. జె.శాంత ఇప్పటికే వైకాపాలో చేరి గత లోక్‌సభ ఎన్నికల్లో హిందూపురం క్షేత్రం నుంచి పోటీ చేశారు. ఇలా వాల్మీకి సముదాయం నుంచి ఒక్కో నేత గాలి జనార్దనరెడ్డికి దూరమయ్యారు. ఈ నేపథ్యంలో బంగారు హనుమంతుకు టికెట్ ఇప్పించి గెలిపించుకుంటే తిరిగి పూర్వ వైభవం సాధించవచ్చని, అధిష్ఠానం దగ్గర మార్కులు కొట్టేయవచ్చనే గాలి జనార్దన్‌రెడ్డి రూట్ మార్చినట్లు పార్టీ ప్రముఖ నేతలు అంటున్నారు. నిజానికి 2019 లోక్ సభ ఎన్నికల్లోనే బంగారు టికెట్ ఆశించినా చివరికి వై.దేవేంద్రప్పకు దక్కిన విషయం తెలిసిందే. 2018లో సండూరు విధానసభ క్షేత్రం నుంచి పోటీ చేయడానికి హనుమంతప్ప ప్రయత్నాలు చేశారు. టికెట్ రాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 7,191 ఓట్లు సాధించారు.



సండూరు నియోజకవర్గ ముఖచిత్రం

టికెట్‌కు గట్టి పోటీ ఉన్నా..

సండూరు నియోజకవర్గం ఉప ఎన్నికలో 19 మంది పోటీ చేయడానికి ఆసక్తి చూపారు. వారిలో కె.ఎస్.దివాకర్, మాజీ ఎంపీ దేవేంద్రప్ప కుమారుడు అప్పణ్ణ, సోమప్ప గట్టిగా ప్రయత్నాలు చేశారు. కె.ఎస్.దివాకర్ బళ్లారి నగరానికి చెందిన వారు. స్థానికులకే టికెట్ ఇవ్వాలని ఇక్కడి నేతల డిమాండ్‌తో దివాకర్ 15 ఏళ్లుగా సండూరు పట్టణంలోనే నివాసం ఉంటున్నారు. 2018లో టికెట్ కోసం గట్టిగా ప్రయత్నించినా చివరికి రాఘవేంద్రకు దక్కింది. 2023లోనూ చివరి క్షణంలో శిల్ప రాఘవేంద్రకు టికెట్ ఇవ్వడంతో దివాకర్ కేఆర్‌పీపీ నుంచి పోటీచేసి 32 వేలు ఓట్లు సాధించారు. ఈసారి ఉప ఎన్నికలో తప్పకుండా టికెట్ వస్తుందనే నమ్మకంతో మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డికి అత్యంత అప్తుడిగా మారి ఆయన వెంట తిరిగారు. ఎప్పటిలాగానే చివరి క్షణంలో టికెట్ తప్పిపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయన్ని బుజ్జగించడానికి పార్టీ నేతలు శ్రమిస్తున్నారు. మరి సండూరు స్థానం భాజపా కైవసమయ్యేనా, గాలి జనార్దన్‌రెడ్డి హవా నడిచేనా తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే.

సమాజానికి ఉపయోగపడినప్పుడే సంతృప్తి



సన్మాన గ్రహీతలతో పూర్వ విద్యార్థులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: శిష్యులు ఉత్తమ జీవన విధానంతో సమాజానికి ఉపయోగపడినప్పుడే గురువులకు సంతృప్తిగా ఉంటుందని ఉపాధ్యాయుడు రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 2008-09 ఏడాది పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకొని జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యా బోధన చేసిన గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ నాడు కష్టపడి చదువుకుని నేడు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేసుకుంటూ, వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించడం ఆనందంగా ఉందన్నారు. మీరు సంపాదించిన దాంట్లో కొంత పేద పిల్లల చదువులకు, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు వెచ్చిస్తూ సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ అనుభవాలు, జ్ఞాపకాలను పంచుకున్నారు. గురువులు రామమోహన్, సురేశ్, నాగేంద్రప్ప, రమేశ్, అపర్ణ, తులసి, లక్ష్మీదేవి శంభులింగ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో క్యాంటీన్

కారటగి, న్యూస్‌టుడే: స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇందిరా క్యాంటీన్ నిర్మిస్తామని పురసభ ముఖ్యాధికారి సురేశ్ తెలిపారు. కారటగిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గతంలో ఆ స్థలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేదన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేశారన్నారు. వైద్య సిబ్బంది వసతి గృహాలూ అక్కడే ఉన్నాయని, క్యాంటీన్ ఏర్పాటుకు ఎవరూ అభ్యంతరం చెప్పలేదన్నారు. అక్కడి వార్డు సభ్యుడు పార్టీ నాయకులతో కలిసి క్యాంటీన్ నిర్మాణం వద్దంటూ పురసభకు వినతిపత్రం సమర్పించారని తెలిపారు. ఆ స్థలం యజమానులు ఎవరైనా ఉంటే దాఖలాలను పురసభకు చూపాలన్నారు. వాటిని పరిశీలించిన తర్వాత పురసభ పాలక మండలి తగు నిర్ణయం తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

24న పండరీపురానికి పాదయాత్ర

కారటగి, న్యూస్‌టుడే: కారటగి నుంచి మహారాష్ట్రలోని పుణ్యక్షేత్రం పండరీపురానికి ఎనిమిదో ఏడాది పాదయాత్ర 24వ తేదీన ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు ఉదయం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేసి పాదయాత్ర చేపడతామన్నారు. 17 రోజుల అనంతరం పండరీపురం చేరుకుంటారన్నారు. మార్గమధ్యలో భోజనం, వసతి కల్పించడం జరుగుతుందని, ఆసక్తి కలిగిన వారు 23న సాయంత్రం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయం వద్దకు రావాలని కోరారు.

రక్తదానంతోనే జీవదానం సాధ్యం



రక్తదాతలను సన్మానించిన రమేష్‌బాబు, ఇంద్రాణి తదితరులు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: రక్తదానంతో సాటి మనిషికి ప్రాణం పోయవచ్చని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డా. యల్లా రమేష్‌బాబు అన్నారు. కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా ఆరోగ్య అధికారి సభా భవనంలో ఏర్పాటు చేసిన జాతీయ స్వయంప్రేరిత రక్తదాన దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒక యూనిట్ రక్తంతో ఆధునిక సాంకేతికతో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. గర్భిణులకు రక్తం చాలా అవసరమని, ఎంతోమంది రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రసవ సమయంలో రక్తం లేక ఒక్కోసారి మృత్యుపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారికి రక్తదాన శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని పిలుపు ఇచ్చారు. అనంతరం 29 సార్లు రక్తదానం చేసిన దాత రవిచెళ్లగుర్కిని సన్మానించారు. టాస్క్‌ఫోర్సు అధికారి డా.ఇంద్రాణి, గిరీష్, సిబ్బంది, రామాంజనేయలు, రక్తదాతలు పాల్గొన్నారు.

పంచాయతీ భవనానికి స్థలం కేటాయించండి



మోహన్‌రాజ్‌ను సత్కరిస్తున్న పంచాయతీ సభ్యులు

గంగావతి, న్యూస్‌టుడే: నూతన సణాపుర గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కృష్ణా జలభాగ్య నిగమ ఎండీ, కొప్పళ జిల్లా బాధ్య కార్యదర్శి కె.పి. మోహన్‌రాజ్‌ను ఆదివారం సభ్యులు కోరారు. గ్రామ పంచాయతీని సందర్శించిన ఆయనకు సభ్యులు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. ఆనెగుంది నుంచి విభజించి సుమారు తొమ్మిదేళ్ల క్రితం ఈ నూతన గ్రామ పంచాయతీని ఏర్పాటు చేశారన్నారు. స్థలం కొరతతో సొంత భవనం లేకపోవడంతో పాఠశాల గదుల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆయన దృష్టికి తెచ్చారు. గ్రామంలో నీటిపారుదల శాఖకు చెందిన పాత కట్టడాలు శిథిలావస్థకు చేరాయని, ఆ స్థలాన్ని కేటాయించాలని కోరారు. స్పందించిన మోహన్‌రాజ్ పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షుడు శిరిగిరి అశోక్, పీడీఓ వత్సల, సభ్యుడు కోడి నాగేశ్, మాజీ ఉపాధ్యక్షుడు పి.నరసింహులు, గ్రామ లెక్కాధికారి చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

‘వీలైతే చక్కెర మిల్లు నేనే ప్రారంభిస్తా’

హొసపేటె, న్యూస్‌టుడే: ‘హొసపేటెలో చక్కెర మిల్లు ప్రారంభించడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. రైతుల కోరిక మేరకు వీలైతే తానే చక్కెర మిల్లు పెడతానని’ స్థానిక శాసనసభ్యుడు హెచ్.ఆర్.గవియప్ప పేర్కొన్నారు. పట్టణంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక పారిశ్రామికవేత్తలను చక్కెర మిల్లు పెట్టాలని కోరినా ఎలాంటి స్పందన రాలేదని అన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో ముఖ్యమంత్రితో చర్చలు జరిపి తానే చక్కెర మిల్లు ప్రారంభిస్తానని స్పష్టం చేశారు. తాలూకా పరిధి నాగేనేహళ్లి వద్ద మిల్లు కోసం స్థలం గుర్తించామన్నారు. అక్కడ మిల్లు ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల గ్రామాల రైతులకు చెరకు సరఫరాకు వెసులుబాటు కలుగుతుందన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాలను గుర్తించి నిరుపేదలకు ఇళ్లను నిర్మించే ఆలోచన ఉందన్నారు. పట్టణంలో హృద్రోగ చికిత్స కేంద్రాన్ని త్వరలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నాగేనహళ్లి, కల్లహళ్లి, పాపినాయకనహళ్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరైనట్లు వెల్లడించారు. సండూరు నియోజకవర్గ టికెట్ ఎవరికి ఇచ్చినా గెలుపు కాంగ్రెస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు.

22 నుంచి క్రీడా పోటీలు

బళ్లారి: బళ్లారి-విజయనగర కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 22 నుంచి రెండు రోజుల పాటు అంతర విశ్వవిద్యాలయాల స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయని పరిపాలన రిజిస్ట్రార్ ఎస్.ఎన్.రుద్రేశ్ తెలిపారు. పోటీల్లో వివిధ విశ్వవిద్యాలయాల జట్లు తలపడతాయని ఆయన వెల్లడించారు.

వినికిడి యంత్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి, న్యూస్‌టుడే: భారతీయ రెడ్‌క్రాస్, రాష్ట్ర సంస్థ, బళ్లారి శాఖ సంయుక్తంగా 2024 ఏడాదికి జిల్లాలో 20-30 ఏళ్ల వయసు కలిగిన పురుషులు, స్త్రీలకు ఉచిత శ్రవణ యంత్రాలు (వినికిడి) వితరణ చేయనున్నాయి. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్, గుర్తింపు కార్డు, నివాసం తదితర పత్రాలను జత చేసిన దరఖాస్తులను 31వ తేదీలోపు జిల్లా కార్యదర్శి, భారత రెడ్ క్రాస్ సంస్థ, కోర్టు రహదారి, మయూర హోటల్ వెనకభాగం, బళ్లారి-583101కు పంపాలని కోరారు.

నవంబరు 10న ఆరాధనోత్సవం

మాన్వి, న్యూస్‌టుడే : తాలూకాలోని చికల్‌పర్వి గ్రామం వద్ద తుంగభద్ర నది తీరం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం, విజయదాసుల కట్ట వద్ద విజయదాసుల ఆరాధనోత్సవాన్ని నవంబరు 10న నిర్వహిస్తున్నట్లు మఠం నిర్వాహకులు వెల్లడించారు. మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం సుబుదేంద్రతీర్థ శ్రీపాదంగళ్ మూలరామ సంస్థాన పూజ చేస్తారు. విజయదాసుల నూతన వెండి ఉత్సవ విగ్రహాన్ని మఠానికి సమర్పిస్తారు. విజయదాసుల కట్ట వద్ద నవంబరు 13 వరకు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

నీర్‌మాన్వి యల్లమ్మదేవి జాతర

మాన్వి : దీపావళి పాడ్యమి సందర్భంగా నవంబరు 1 నుంచి 3 వరకు నీర్‌మాన్వి యల్లమ్మదేవి చిన్నజాతర నిర్వహిస్తున్నట్లు దేవస్థాన సమితి అధ్యక్షుడు, తహసీల్దార్ రాజు ఫిరంగి తెలిపారు. సోమవారం టెంకాయల సగటు వ్యాపారం, మంగళహారతి, టెంకాయలు కొట్టేందుకు, దుకాణాలు నెలకొల్పుకునేందుక టెండర్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వ్యాపారులు సోమవారం ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో టెండర్ ప్రక్రియలో పాల్గొనవచ్చునని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర పూజలు



నగరంలోని రేడియో పార్కు సుందర గణపతి ఆలయంలో సంకష్టహర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, గరికె, రజత కవచంతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. చంద్రదర్శనంతో భక్తులు ఉపవాస దీక్ష విరమించారు. వరసిద్ధి వినాయక, జోడు గణపతి ఆలయాల్లోనూ పూజలు జరిగాయి. –న్యూస్‌టుడే బళ్లారి గ్రామీణ

నేడు పోలీస్ అమరవీరుల దినోత్సవం

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో 21న ఉదయం 8 గంటలకు డీఏఆర్ పరేడ్ మైదానంలో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని ఆచరిస్తున్నట్లు ఎస్పీ శ్రీహరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అదనపు న్యాయమూర్తి అబ్దుల్ రహీమాన్ ఎ.నందగడి, అటవీశాఖ అధికారి అర్సలన్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు.

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు స్థానిక పాత కోర్టు రహదారిలోని జిల్లా పోలీస్ క్రీడా మైదానంలో అమరవీరుల దినోత్సవం నిర్వహించనున్నారు. బళ్లారి పోలీస్ విభాగం ఐజీపీ లోకేష్‌కుమార్, డీసీ ప్రశాంత్‌కుమార్, ఎస్పీ శోభారాణి తదితరులు పాల్గొంటారు.

కాలువలో మహిళ మృతదేహం

మాన్వి, న్యూస్‌టుడే : తాలూకాలోని 76వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. హిరేకొట్నేకల్ నీటిపారుదల శాఖ సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం కాలువపై గస్తీలో ఉన్న గ్యాంగ్‌మెన్ కాలువలో మృతదేహాన్ని గుర్తించారు. అధికారులకు సమాచారం అందించాడు. మహిళ వయసు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. మాన్వి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



చంద్రుగౌడను సత్కరిస్తున్న గ్రామస్థులు

సింధనూరు, న్యూస్‌టుడే: గ్రామీణులకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తనయుడు, యువ కాంగ్రెస్ నాయకుడు చంద్రుగౌడ బాదర్లి అన్నారు. ఆయన గోన్వార గ్రామంలో ఆదివారం రూ.40 లక్షలతో కేకేఆర్‌డీబీ పథకం కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తరఫున భూమిపూజ చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే హంపనగౌడ ఆధ్వర్యంలో జరిగే పనులు ప్రజలకు పదికాలాలపాటు ఉపయోగపడేలా ఉంటాయన్నారు. గ్రామస్థులు వాటిని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున హట్టి, బీహెచ్ నాయక్, యేశప్ప, డా.రామణ్ణ, శంకరగౌడ మాలీపాటిల్ తదితరులు పాల్గొన్నారు. తొలుత చంద్రుగౌడ బాదర్లిని గ్రామస్థులు సత్కరించారు.

24 నుంచి ‘గాంధీ గురించి చదువు’

హొసపేటె, న్యూస్‌టుడే: హంపీ కన్నడ విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థుల సంఘం, జిల్లా విద్యా శాఖలు కలిసి 24 నుంచి 30 వరకు ‘గాంధీ గురించి చదువు’ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 24న బాలికల మాధ్యమిక పాఠశాల ఆవరణలో ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే హెచ్.ఆర్.గవియప్ప ప్రారంభిస్తారన్నారు. కొప్పళ జిల్లా హిట్నాళ ప్రభుత్వ కళాశాల ఉపన్యాసకుడు డాక్టర్ టి.హెచ్.బసవరాజ్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారన్నారు. తాలూకా విద్యాశాఖ అధికారి ఎం.చెన్నబసప్ప ముఖ్యఅతిథిగా హాజరవుతారని, హంపీ కన్నడ వర్సిటీ ఉపకులపతి డాక్టర్ డి.వి.పరమశివమూర్తి అధ్యక్షత వహిస్తారని అందులో పేర్కొన్నారు.

పిల్లలకు విద్య అవసరం



వాల్మీకి చిత్రపటానికి నివాళుర్పిస్తున్న సోమలింగప్ప తదితరులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ శాసనసభ్యుడు ఎం.ఎస్.సోమలింగప్ప పేర్కొన్నారు. పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో ఆదివారం వాల్మీకి జయంతి ఆచరించారు. ఈ సందర్భంగా ఆయన వాల్మీకి చిత్రపటానికి ఇతర నాయకులతో కలిసి పూలు వేసి నివాళర్పించి మాట్లాడుతూ వాల్మీకి సముదాయానికి ఎస్టీ రిజర్వేషన్ లభించి అనేక సంవత్సరాలు అవుతున్నా ఇంకా విద్యపరంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడే ఉన్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు పంపించకుండా పాఠశాలలకు పంపి చదివించాలన్నారు. కార్యక్రమంలో నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, మాజీ అధ్యక్షుడు బి.ఎం.సతీష్, వాల్మీకి మహాసభ తాలూకా అధ్యక్షుడు నరసింహ నాయక్, భాజపా తాలూకా అధ్యక్షుడు కుంట్నాళ్ మల్లికార్జున స్వామి తదితరులు పాల్గొన్నారు.

కన్నడ జ్యోతి రథానికి ఘన స్వాగతం



కారటగి: స్వాగతం పలికిన అధికారులు, సాహిత్య పరిషత్ ప్రతినిధులు

బళ్లారి, న్యూస్‌టుడే: కన్నడ అంటే కావేరి నుంచి గోదావరి వరకు విస్తరించి ఉండేదని పూర్వికులు చెప్పారని తహసీల్దార్ నరసప్ప అన్నారు. ఆదివారం కురుగోడు పట్టణంలోని దొడ్డ బసవేశ్వర దేవస్థానం ఆవరణలో తల్లి భువనేశ్వరి రథయాత్రకు ఆయన ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించి మాట్లాడారు. కన్నడను కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు డా.నిష్ఠిరుద్రప్ప మాట్లాడుతూ రథయాత్ర బళ్లారికి రావడంతో పండగ వాతావరణం నెలకొందన్నారు. 87వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనంలో భాగంగా ఏర్పాటు చేసిన భువనేశ్వర మాత రథయాత్రకు ప్రజలు ఘనంగా స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. కురుగోడు పురసభ అధ్యక్షులు శేఖణ్ణ, ఉపాధ్యక్షులు చెన్న పట్టణం మల్లికార్జున, కన్నడ సంస్కృతిశాఖాధికారి నాగరాజ వివిధశాఖాధికారులు, సిబ్బంది, కన్నడ సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.



సిరుగుప్ప: రథం ముందు డోలు వాయిస్తున్న విద్యార్థులు, కళాకారులు

బళ్లారి తాలూకాలోకి ప్రవేశం: కురుగోడు తాలూకాలో ముగిసిన రథయాత్ర ఆదివారం సాయంత్రం బళ్లారి తాలూకాలోకి ప్రవేశించింది. తహసీల్దార్ గురురాజు, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షులు నిష్ఠిరుద్రప్ప తదితరులు ఘన స్వాగతం పలికారు. రాజ్‌కుమార్ రహదారిలోని ప్రభుత్వ మున్సిపల్ పదవి పూర్వ కళాశాల నుంచి ప్రారంభమైన రథయాత్ర గడిగి చెన్నప్ప కూడలి, బెంగళూరు రిదారి, బ్రూస్‌పేటె కూడలి, తేరు వీధి మీదగా, జైన్ మార్కెట్, హెచ్.ఆర్.గవియప్ప కూడలి మీదగా జిల్లా పాలనాధికారి కార్యాలయంకు వరకు సాగింది.

సిరుగుప్ప, న్యూస్‌టుడే: కన్నడ జ్యోతి రథానికి సిరుగుప్పలో ఘన స్వాగతం లభించింది. కారటగి నుంచి రథయాత్ర సిరుగుప్ప తాలూకాలోకి ప్రవేశించగానే తహసీల్దార్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది పూజలు చేశారు. అనంతరం పట్టణ ప్రధాన రహదారులు, కూడళ్ల మీదుగా వివిధ కళాబృందాల నృత్యాల నడుమ కురుగోడుకు సాగింది. నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరయ్య స్వామి, పికార్డ్ బ్యాంకు అధ్యక్షుడు బసవనగౌడ, నగరసభ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

కారటగి, న్యూస్‌టుడే: కన్నడ జ్యోతి రథయాత్రకు తాలూకాలోని సోమనాళ గ్రామంలో అధికారులు, కన్నడ సాహిత్య పరిషత్ ప్రతినిధులు శనివారం రాత్రి ఘన స్వాగతం పలికారు. తహసీల్దార్ ఎం.కుమారస్వామి కన్నడ మాత భువనేశ్వరికి పూజలు చేసి మాట్లాడారు. 87వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం సందర్భంగా ఈ రథయాత్ర జరుగుతోందన్నారు. అక్కడి నుంచి రథయాత్ర గూడూరు, నాగన్‌కల్ గ్రామాల మీదుగా కారటగి చేరుకుంది. కనకదాస కూడలిలో స్థానిక ప్రజా ప్రతినిధులు రథ యాత్రకు స్వాగతం పలికారు.



బళ్లారి: ఊరేగింపులో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, వివిధ కన్నడ సంఘాల సభ్యులు

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

20-10-2024 (ఉ. 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.91	1612.18
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	51,587	406
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	51,407	9,934
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.421	42.051

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు



తిరుపతి శ్రీవారి ఆలయం ఆకృతిలో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

నేడు శాసనసభ్యుడి కుమార్తె వివాహం

చెళ్లకెర, న్యూస్‌టుడే: చెళ్లకెర శాసనసభ్యుడు టి.రఘుమూర్తి కుమార్తె సుచిత్ర వివాహం నేడు (సోమవారం) జరగనుంది. స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో పెళ్లికి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరవుతారని ఎమ్మెల్యే రఘుమూర్తి న్యూస్‌టుడేకు తెలిపారు.

దేశ రక్షణ భాజపాతోనే సాధ్యం

సింధనూరు, న్యూస్‌టుడే: భాజపాతో ఏ పార్టీ సరి సమానం కాదని, దేశ రక్షణ తమ పార్టీతోనే సాధ్యమవుతుందని సీనియర్ నాయకుడు కె.కరియప్ప అన్నారు. కొద్ది రోజులుగా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన భాజపా సభ్యత్వ నమోదు అభియాన్ ఆదివారం పట్టణంలోని వివిధ వార్డుల్లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరవాణి యాప్ ద్వారా సభ్యత్వ నమోదు చేపట్టగా అనేక మంది యువకులు ఉత్సాహంగా చేరారన్నారు.

అందాల గిరి.. ఆహ్లాదాల పందిరి

➡ పర్వతారోహణకు యువత ఉత్సాహం ➡ కుదురెముఖ్‌లో మళ్లీ ట్రెక్కింగ్ ప్రారంభం


పచ్చిగడ్డి మధ్య యువతీ యువకుల సంచారం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: పడమటి కనుమల్లోని కుదురెముఖ్ అటవీ ప్రాంతంలో మళ్లీ పర్వతారోహణ (ట్రెక్కింగ్) ప్రారంభమైంది. కురుస్తున్న చినుకుల మధ్య అధిరోహణ చేస్తే అనుభూతి వేరుగా ఉంటుందని యువత అభిప్రాయం. ట్రెక్కింగ్ చేసేందుకు బెంగళూరు, మైసూరు, బెళగావి, బళ్లారి తదితర ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు ఎక్కువ మంది తమ పేర్లను అటవీ శాఖ అంతర్జాలంలో నమోదు చేసుకుంటున్నారు. మొన్నటి వరకు కురిసిన వర్షాల కారణంగా అటవీ శాఖ అధికారులు కొన్నిరోజులు పర్వతారోహణ నిలిపి వేసి మళ్లీ ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన యువత తమ పేర్లు నమోదు చేసుకునేందుకు ముందంజలో ఉన్నట్లు తెలియజేశారు. రోజుకు మూడువందల మంది ట్రెక్కింగ్ నిర్వహించేందుకు అనుమతిస్తున్నారు. సాధారణంగా రెండువందల మందికి అవకాశం కల్పిస్తుండగా పెరుగుతున్న ఒత్తిడి కారణంగా సంఖ్యను పెంచినట్లు కుదురెముఖ్ వన్యజీవి విభాగం అటవీ అధికారి హరీశ్ తెలిపారు. మూడు వందల మంది కన్నా ఎక్కువ మందిని అనుమతించబోమన్నారు. ట్రెక్కింగ్‌కు వచ్చే వారి కోసం సంసె గ్రామం వద్ద 30 హోం స్టేలను ఏర్పాటు చేశారు. అక్కడ బయలు ప్రదేశంలో స్లీపింగ్ బ్యాగుల్లో నిద్రించే విధంగా పెద్ద గుడారాలు, స్త్రీ, పురుషులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. చిక్కమగళూరు జిల్లా పర్వత శ్రేణిలోని కలసా నుంచి 20 కిలోమీటర్ల దూరంలో కుదురెముఖ్ పర్వతాలు ప్రారంభమవుతాయి. సంసె పర్వత ప్రదేశం నుంచి ట్రెక్కింగ్ ప్రారంభించేందుకు అనుమతిస్తారు. 22 కిలోమీటర్ల వరకు చేయవచ్చును. పర్వత శిఖరాలు 1894 మీటర్ల ఎత్తులో ఉన్నాయి. అవి ఏటవాలుగా ఉండి దట్టమైన గడ్డి, పొగమంచుతో కప్పేశాయి. మేఘాలు పర్వతాలను తాకుతూ ముందుకు సాగుతాయి. నిత్యం తుంపర జల్లులు కురుస్తుండటంతో ప్రకృతి అందాలు కన్నువిందు చేస్తున్నాయి. అందులల ఏటా 7000 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుంది. కుదురెముఖ పర్వతాల నుంచి తుంగ, భద్ర, నేత్రావతి నదులు పుట్టి కిందకు ప్రవహిస్తున్నాయి. ప్రకృతి సహజంగా ఏర్పడిన పచ్చికతో కూడిన పర్వతాల్లో సంచరించేందుకు ప్రకృతి ప్రేమికులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ట్రెక్కింగ్ వెంట అటవీ శాఖ సిబ్బంది, గైడ్ తదితరులు ఉంటు అనునిత్యం గమనిస్తుంటారు. అనారోగ్యం పాలైతే అప్పటికప్పుడు ప్రాథమిక చికిత్స అందిస్తారు. ఆ సమయంలో ఆసుపత్రికి తరలించడానికి వాహనాలను అందుబాటులో ఉంచుతారు. సురక్షితంగా ట్రెక్కింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.


ట్రెక్కింగ్ చేసేందుకు వచ్చిన వివిధ ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు


కుదురెముఖ్ పర్వత శ్రేణిలో ట్రెక్కింగ్ చేస్తున్న పరిసర ప్రేమికులు


రాత్రి బస చేసేందుకు హోం స్టేల ముందు ఏర్పాటు చేసిన గుడారాలు

దొరకని హెడ్‌కానిస్టేబుల్ ఆచూకీ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: మీ పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మహిళను నమ్మించి ఆమె వద్ద రూ.47లక్షలు నగదు, 857 గ్రాముల బంగారు నగల తీసుకుని మోసగించి, అడిగితే హత్య చేస్తానని బెదిరించి పరారీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు అతడి ఇద్దరి స్నేహితుల కోసం సందినకెరెబెట్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. చామరాజపేట సీఏఆర్ విభాగం హెడ్‌కానిస్టేబుల్ ప్రశాంతకుమార్ అతడి అనుచరులు ప్రశాంత్, దీపా కోసం గాలిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. తాను ఎమ్మెల్సీ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నానని, ఇద్దరి పిల్లలకు ప్రభుత్వోద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి తనను మోసగించారని సుందర భాగ్య సందినకెరెబెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దశలవారీగా తన వద్ద నగదు, బంగారు నగలు తీసుకుని ఉద్యోగాలు ఇప్పించలేదన్నారు. నగదు, నగలు ఇవ్వాలని అడిగితే హత్య చేస్తానని బెదిరించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

వంచకుడి కోసం గాలింపు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై పదేపదే అత్యాచారానికి పాల్పడి పరారైన నిందితుడి కోసం కొడిగేహళ్లి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అత్యాచారానికి గురైన 22 ఏళ్ల యువతి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి, నిందితుడు ఇద్దరు ఒక దగ్గర పని చేస్తున్నారు. స్నేహం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు యువతి ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సినీ దర్శకుడిపై ఫిర్యాదు

బెంగళూరు(యశ్వంతపుర): పుస్తకాలు, సీడీలు కొనుగోలు చేసి నగదు చెల్లించలేదని ఆరోపిస్తూ కన్నడ సినీ దర్శకుడు గురుప్రసాద్‌పై జయనగర పోలీసులు కేసు నమోదు చేశారు. 2019లో జయనగర టోటల్ కన్నడ దుకాణానికి వచ్చి రూ.69 వేల విలువ చేసే పుస్తకాలు, సీడీలను కొనుగోలు చేసి నగదు చెల్లించలేదని యజమాని లక్ష్మీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగదు చెల్లించాలని తాను పలుమార్లు అడిగినా సమాధానం ఇవ్వలేదని, ఇంటికి వెళ్లే చిరునామా మారినట్లు తెలిపారు. ఇక లాభం లేదని పోలీసులను ఆశ్రయించినట్లు తెలియజేశారు.

విధుల నుంచి ఇద్దరి తొలగింపు

కార్వార: కార్వార, గోవా సరిహద్దులో మాజాళి చెక్ పోస్టులో మండ్యకు చెందిన ఒక లారీ డ్రైవరుపై దాడి చేసిన ఇద్దరు సిబ్బందిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. లారీ డ్రైవరు నిర్లక్ష్యంగా వ్యవహరించాడని ఆరోపిస్తూ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ సదాశివ కోర్తి, కానిస్టేబుల్ హేమచంద్ర అతనిపై దాడి చేశారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. లారీ డ్రైవర్ల సంఘం, లారీల యజమానుల సంఘం ఈ ఘటనను ఖండించింది. దాడిని తీవ్రంగా పరిగణించిన అధికారులు వారిద్దరినీ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

చామంతి ధరలు తగ్గుముఖం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: శరన్నవరాత్రులు ముగిసిన అనంతరం చామంతి పూల ధరలు పాతాళానికి పడిపోయాయి. పండగ సమయంలో కిలో రూ.20 వరకు పలికిన చామంతి ప్రస్తుతం కిలో ఒక రూపాయికి చేరుకుంది. పలువురు రైతులు మార్కెట్‌కు పూలు తీసుకురాకుండా, మొక్కలకే వాటిని వదిలి వేస్తున్నారు. అవసరం ఉన్న వారు చామంతిని కోసుకు వెళ్లాలని సూచిస్తున్నారు. దీపావళి సమయానికి ధర కాస్త పెరుగుతుందని కొందరు సాగుదారులు ధీమాతో ఉన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంపై బాధితుల ధర్నా

కోలారు: వైద్యుల నిర్లక్ష్యంతోనే శాంతమ్మ (35) అనే మహిళ మరణించిందని ఆమె బంధువుల ఆరోపిస్తూ శ్రీనివాసపురలోని పవన్ ఆసుపత్రి వద్ద శనివారం రాత్రి ధర్నాకు దిగారు. శ్రీనివాసపుర తాలూకా కమల వారిపల్లికి చెందిన శాంతమ్మ గర్భకోశ సమస్యలను ఎదుర్కొంటూ చికిత్స కోసం ఆసుపత్రిలో చేరారు. వైద్యుడు వేణుగోపాల్, ఆయన భార్య డాక్టర్ కవిత నిర్లక్ష్యంతోనే తమ కుటుంబ సభ్యురాలు మరణించిందని ఆమె బంధువులు ఆరోపించారు. ఆదివారం ఉదయం వరకు ధర్నా కొనసాగించారు. వైద్య దంపతులపై శ్రీనివాసపుర ఠాణాలో కేసు నమోదైంది.

‘గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తా’

మైసూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి ముడాకు చెందిన 20 గుంటల భూమి (అర ఎకరం)ని 2023 సెప్టెంబరు 29న రిజిస్ట్రార్ ద్వారా తన పేరిట మార్పించుకున్నారని సహ కార్యకర్త గంగరాజు ఆరోపించారు. దీనిపై తాను గవర్నర్ గహ్లోత్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ దీనిపై తాను ముడా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదని చెప్పారు. తన వద్ద ఉన్న దాఖలాను అందించేందుకు సమయం ఇవ్వాలని గవర్నర్ కార్యాలయం అధికారులను ఇప్పటికే కోరానని తెలిపారు. ఇప్పుడు కొన్ని దాఖలాలను సరి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

ధార్వాడ, న్యూస్‌టుడే: ధార్వాడ సంపిగెనగర బస్టాండ్ వద్ద ఆదివారం వేకువజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవరు రమేశ్ హంచినమని (35), ఆయన కుటుంబ సభ్యురాలు మరియవ్వ హంచినమని (55 మరణించారు. రమేశ్ కుటుంబ సభ్యులు రేణుకా, ప్రణవ్, పృథ్వీ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వీరు వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ధార్వాడ నగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గందరగోళాన్ని ఎదుర్కొంటున్నారు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: సుభద్రంగా లేని ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైపు ఉండాలా, ఉప ముఖ్యమంత్రి వైపు ఉండాలా అనే విషయంలో వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి గందరగోళాన్ని ఎదుర్కొంటున్నారని విపక్ష నాయకుడు అశోక్ ఎద్దేవా చేశారు. దళ్‌లో ఉన్నప్పటి నుంచి తన పాత మిత్రుడు సిద్ధరామయ్యకు మద్ధతు ఇవ్వాలా శివకుమార్ ముఖ్యమంత్రి అయితే తన మంత్రి పదవి కాపాడుకునేందుకు ఆయనకే మద్ధతు ఇవ్వాలా అని సతమతం అవుతున్నారని విమర్శించారు. రైతుల హితాన్ని కాపాడితే, మంత్రి పదవి ఎక్కడకూ పోదని హితవు పలికారు. ప్రభుత్వ వైఫల్యాలను విపక్షాలు ఎండగడితే ఉలిక్కిపడకుండా, ప్రజా సమస్యలను పరిష్కరించడం మాని ఎదురుదాడి చేస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదని తన ఎక్స్ కార్పలో ట్వీట్ చేశారు.

భవానీ రేవణ్ణకు ఊరట

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: అత్యాచార బాధితురాలు ఒకరిని అపహరించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ భార్య భవానికి కర్ణాటక హైకోర్టు ఇచ్చిన బెయిలును రద్దు చేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఆమె బెయిలును రద్దు చేయాలని ప్రత్యేక దర్యాప్తు దళం తరపు న్యాయవాది సర్వోన్నత న్యాయస్థానంలో వాదనలను వినిపించారు. ఆమె రాజకీయ కుటుంబానికి చెందిన మహిళ అని జామీను ఇవ్వకుండా నిర్బంధించడం కుదరదని, హైకోర్టు ఇచ్చిన బెయిలు సబబుగానే ఉందని సుప్రీంకోర్టులో న్యాయమూర్తి పేర్కొన్నారు.

‘నువ్వు అప్పటికింకా పుట్టలేదు’

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: ‘నువ్వు శిశు విహార్‌లో ఉన్నప్పుడు నేను ఎంపీగా ఉన్నాను. నువ్వు పుట్టిన సమయంలో నేను ఎమ్మెల్యేను. నేను రాజకీయాల్లోకి అడుగు పెట్టినప్పటికి నువ్వు ఇంకా పుట్టలేదు’ అంటూ ఎంపీ తేజస్వి సూర్యను ఉద్దేశించి మంత్రి ఎంబీ పాటిల్ ఎద్దేవా చేశారు. బసవరాజ బొమ్మై ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అభివృద్ధి జరిగిందని, ఇప్పటి ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని సూర్య చేసిన వ్యాఖ్యలకు ఆయన తన ఎక్స్ కార్ప్ వేదికగా ట్వీట్ చేశారు.

ఉపాధ్యాయుడికి శిక్ష

మండ్య: మళవళ్లి తాలూకాలో ట్యూషన్‌కు వచ్చిన బాలిక (11)పై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన ఓ ఉపాధ్యాయుడు (35)కు జీవిత ఖైదు శిక్షను విధిస్తూ మండ్య ఒకటవ ఫాస్ట్ ట్రాక్ న్యాయస్థానం తీర్పు వచ్చింది. నిందితుడు 2022 అక్టోబరు 10న హత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల పరిహారాన్ని ఇవ్వాలని న్యాయసేవల ప్రాధికారను న్యాయమూర్తి మంజుళ ఇట్టి ఆదేశించారు. ప్రభుత్వం తరపు న్యాయవాదిగా వాదనలు వినిపించిన వెంకటరమణ సీతారామ భట్‌ను స్థానిక మహిళా సంఘాల సభ్యులు న్యాయస్థానం ఆవరణలోనే శనివారం సాయంత్రం ఘనంగా సత్కరించారు.

బళ్లె శిబిరానికి మహేంద్ర

మైసూరు, న్యూస్‌టుడే: మదపుటేనుగులను పట్టుకునేందుకు వెళ్లిన సమయంలో గాయపడి మరణించిన ఏనుగు అర్జున స్థానాన్ని కెప్టెన్ మహేంద్ర (41) భర్తీ చేయనుంది. హెచ్‌డీ కోటె తాలూకా బళ్లె శిబిరానికి మహేంద్రను తోడ్కొని వచ్చారు. రామపుర శిబిరం నుంచి లక్ష్మితో కలిపి దాన్ని తీసుకువచ్చి మాస్తమ్మ ఆలయం వద్ద వాటికి పూజలు చేశారు. ఈ శిబిరంలో ఉంటున్న ఏనుగు అర్జున గతేడాది డిసెంబరు 4న మరణించింది. దాంతో పాటు ఈ శిబిరంలోనే ఉంటున్న కుమారస్వామి, దుర్గాపరమేశ్వరి ఏనుగులు వయోసహజమైన అనారోగ్యంతో మరణించాయి. దీంతో శిబిరం ఖాళీ అయింది. ఇప్పుడు మహేంద్ర, లక్ష్మి ఏనుగులు రావడంతో శిబిరంలో సందడి మొదలైంది. వీటితో పాటు మరికొన్ని ఏనుగులను ఇక్కడకు తీసుకువచ్చేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు.


రామపుర లక్ష్మి (ఎడమ)తో మహేంద్ర (కుడి)

ప్రయాణికులకు నూతన మెట్రో ద్వారం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ఉత్తర-దక్షిణ మెట్రోకారిడార్ ఆకుపచ్చ మార్గంలోని ఆర్‌వీ రహదారి మెట్రో స్టేషన్‌లోకి ప్రయాణికులు ప్రవేశించేందుకు నూతన ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ప్లాట్‌ఫాం-2 వైపు మాత్రమే ప్రవేశద్వారం ఉంది. ఇప్పుడు కొత్తగా ప్లాట్‌ఫాం-1 వైపు సంచరించేందుకు నూతన ద్వారాన్ని ప్రారంభించినట్లు బీఎంఆర్‌సీఎల్ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులకు తెర దించారు.


ఆర్‌వీరోడ్డు మెట్రోస్టేషన్‌లో నూతనంగా నిర్మించిన ద్వారం

కర్ణాటక హాకీ సంఘం అధ్యక్షుడిగా పళంగప్ప


పళంగప్ప

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: కర్ణాటక హాకీ సంఘం అధ్యక్షుడిగా వారియర్స్ హాకీ క్లబ్‌కు చెందిన ఎ.బి.పళంగప్ప అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర హాకీ సంఘంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఉపాధ్యక్షులుగా డా.యు.బి.శంకర్ - జైన్ విశ్వవిద్యాలయం, లోకేష్, డా.రఘు, మణిమారన్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.సలీం, జి.ఎస్.వివేక్, గౌరవ కార్యదర్శిగా టి.సి.వినోబ ఎన్నికయ్యారు. పదాధికారులుగా ఇజాజ్‌అహమ్మద్, నవీన్‌కుమార్, ఎ.ఎస్.తిమ్మణ్ణ, శశిధర్, సుజిత్‌కుమార్, జోసెఫ్‌విజయ, డెన్నిస్‌నిఖోలస్, లోకరాజ్‌ను ఎన్నిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

చెత్త నిర్వహణ కేంద్రంలో అగ్ని ప్రమాదం

రామనగర, న్యూస్‌టుడే: చెన్నపట్టణ తాలూకా వందారగుప్పె గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్త నిర్వహణ కేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో మొదలైన మంటల్లో పొడి చెత్త దగ్ధమైంది. సమాచారం అందుకుని రెండు వాహనాలతో అగ్నిమాపక దళ సిబ్బంది అక్కడకు చేరుకునేలోగా పొడి చెత్త పూర్తిగా కాలిపోయింది. చెన్నపట్టణ గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఛాయాచిత్రం.. నేత్రానందభరితం


కొమ్ముల దుప్పిపై దాడి చేస్తున్న చిరుతలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: దేశ విదేశాలకు చెందిన ఛాయాచిత్రగ్రాహకులు తీసిన చిత్రాలను చిత్రకళా పరిషత్తులో యూత్ ఫొటోగ్రఫిక్ సొసైటీ ఏర్పాటు చేసిన ప్రదర్శనకు ఆదివారం తెరపడింది. ఈ ఏడాది పోటీలకు 38 దేశాలకు చెందిన 257 మంది ఔత్సాహిక ఛాయాచిత్రగ్రాహకులు 3227 చిత్రాలను పోటీకి పంపించగా, బహుమతి పొందిన చిత్రాలతో కలిసి వందకు పైగా ఛాయాచిత్రాలను ప్రదర్శించారు. ఎనిమిది మంది విదేశీ, నలుగురు భారతీయ న్యాయనిర్ణేతలు కలర్, హెరిటేజ్ ఆఫ్ ది వరల్డ్, మోనోక్రోమ్, నేచర్ విభాగాల్లో ఉత్తమ ఛాయాచిత్రాలను ఎంపిక చేశారు. హాంగ్‌కాంగ్‌కు చెందిన డయానా చాన్, అరుణ్ ప్రకాశ్, ఇన్ లే వాన్, సుబ్రత బైసాక్ నాలుగు విభాగాల్లో బంగారు పతకాలు దక్కించుకున్నారు. ఇతర విభాగాల్లో నవీనా మోహన్, హెచ్ సతీశ్, రాజశేఖర్, జయేశ్, ప్రసాద్ మంత్రి తదితరులకు వైపీఎస్ కార్యనిర్వాహక సమితి అధ్యక్షుడు మంజు వికాస్ శాస్త్రి, అడోబీ సీఎఫ్ఓ రఘురామ్ కృష్ణన్, యువజన సేవలు, క్రీడా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంసీ రమేశ్ బహుమతులను ప్రదానం చేశారు. దేశ విదేశాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను తెలుసుకునేందుకు ఈ తరహా ఛాయాచిత్ర ప్రదర్శన, పోటీలు ఉపయుక్తంగా ఉంటాయని వైపీఎస్ కార్యదర్శి అనితా మైసూరు తెలిపారు.


సూర్యోదయ వేళ మంచు తెరల మధ్య తాజ్‌మహల్


ధార్మిక ఆచరణలో భక్తులు



నగరంలో పండ్లు కూరగాయల ధరలు (హాప్‌కామ్స్ కిలో.. రూ.లలో)

బెంగళూరు (యశ్వంతపుర):
బీన్స్- 120
క్యారెట్-65
బీరకాయలు-45
క్యాబేజి-18
కాలీఫ్లవర్(ఒక్కోటి)-15
సొరకాయ-35
దొడ్డకాయలు-35
పొట్లకాయ-35
టమాటా(నాటు)-65
టమాటా-55
గుమ్మడి-35
ఆలుగడ్డ-40
ఉల్లిగడ్డలు(మేలురకం)-70
ఉల్లిగడ్డలు(మామూలు)-55
తెల్లగడ్డలు-420
సాంబారు ఉల్లి-120
బీట్‌రూట్-25
వంకాయలు-35
బెండకాయలు-28
ముల్లంగి-40
నిమ్మకాయ-270
★ పండ్లు, ఫలాల ధరలు
ఆపిల్ వాషింగ్‌టన్-345
సిమ్లా ఆపిల్-135
గ్రీన్ ఆపిల్-365
అరటి కాయలు-55
సపోటా-40
పైనాపిల్-35
బొప్పాయి-45
ఆరంజి-65
బత్తాయి-60

ఘనా పఠనం.. చంద్రమౌళి సొంతం


పండితుల మధ్యలో చంద్రమౌళి మురళీకృష్ణన్

శివమొగ్గ, న్యూస్‌టుడే: తొంభై రోజుల పాటు రోజుకు ఏడు గంటల పాటు రుగ్వేద ఘనా పారాయణ చేసిన యువ వేదపండితుడు చంద్రమౌళి మురళీకృష్ణన్‌ను కుడలి శృంగేరి మహాసంస్థానం శనివారం రాత్రి ఘనంగా సత్కరించింది. శివమొగ్గలో శనివారం సాయంత్రం నిర్వహించిన శోభాయాత్రలో మురళీకృష్ణన్‌ను ఊరేగింపుగా గాయత్రి మాంగల్య మందిరానికి తీసుకువచ్చారు. అభినవ శంకర భారతి మహాస్వామి ఆయనకు బంగారు కంకణాన్ని, ఉంగరాన్ని బహూకరించారు. ‘రుగ్వేద ఘనాలంకార’ బిరుదును ప్రదానం చేశారు. హెబ్బలి చైతన్య ఆశ్రమ మఠాధిపతి దత్తావధూత మహారాజ్ చంద్రమౌళి మురళీకృష్ణన్‌కు రూ.10 లక్షల చెక్కును ప్రదానం చేశారు. రుగ్వేద సంహితలో మొత్తం 10,552 రుక్కులు ఉండగా, ఉదయం నాలుగు గంటలు, సాయంత్రం మూడు గంటల పాటు మొత్తం 630 గంటల పాటు ఆయన ఘనా పఠనం చేశారు. దీంతో పాటు శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్త, జ్యోతిషం, కల్పం, సంహిత, బ్రాహ్మణ్య, అరణ్యకం, ప్రాతిఖాఖ్య అనే గ్రంథాన్ని చంద్రమౌళి మురళీకృష్ణన్ పారాయణం చేయడం గొప్పవిషయమని శంకర భారతి ప్రశంసించారు. కఠినమైన పారాయణాన్ని ఒకే వ్యక్తి పుస్తకాలను చూడకుండా పఠించడం గొప్ప విషయం. చాతుర్మాస దీక్ష ముగింపు సందర్భంగా చంద్రమౌళిని సత్కరించారు. హిందూ సంఘాల ప్రతినిధులు, స్థానిక మఠాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


చంద్రమౌళి మురళీకృష్ణన్‌ను సత్కరిస్తున్న దత్తావధూత మహారాజ్

డిసెంబరు 20న ‘యూఐ’ రాక

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ప్రముఖ సినీనటుడు ఉపేంద్ర నటిస్తున్న ‘యూఐ’ చిత్రం డిసెంబరు 20న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళం, హిందీ భాషల్లో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు జి.మనోహరన్, కేపీశ్రీకాంత్ తెలిపారు. విభిన్నమైన కథలో హీరోగా ఉపేంద్ర నటిస్తుండటంతో ప్రేక్షకులు విడుదల కోసం ఎదురు చూస్తున్నారని తెలియజేశారు. చిత్రానికి సంబంధించిన పోస్టర్ ఇటీవల విడుదల చేశారు. ఉపేంద్రతో పాటు రీష్మా నాణయ్య హీరోయిన్‌గా నటిస్తున్నారు.



ఉపేంద్ర నటిస్తున్న యూఐ చిత్రం పోస్టర్ విడుదల

25న ‘యలాకున్ని’ విడుదల

ప్రముఖ హాస్యనటుడు కోమల్ కుమార్ నటిస్తున్న ‘యలాకున్ని’ చిత్రం ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. సౌందర్య సినీ కంబైన్స్, నరసింహ సినిమాస్ బ్యానర్లపై అనుసూయ కోమల్‌కుమార్, సహనమూర్తి నిర్మిస్తున్న చిత్రానికి కోమల్‌కుమార్ చిత్రకథతో పాటు సాహిత్యం, దర్శకత్వం వహిస్తున్నారు. ఆకర్ష, నిసర్గ అప్పణ్ణ, యతిరాజ్, జయసింహ ముసురి,మయూర్ పటేల్, సాధుకోకిల, దత్తణ్ణ, మిత్ర, తబలనాణి, శివరాజ్‌కె.ఆర్.పేట, మానసిసుధీర్ సుమన్‌నగరకర్ తదితరులు నటిస్తున్నారు.


యలాకున్ని చిత్రంలో కోమల్‌కుమార్, ఆకర్ష

‘అభిమన్యు సన్‌ఆఫ్ కాశీనాథ్’ చిత్రీకరణ

కన్నడ హాస్యనటుడు కాశీనాథ్ కుమారుడు అభిమన్యు కాశీనాథ్ తొలిసారిగా ముఖానికి రంగు వేసుకుని నటిస్తున్న ‘అభిమన్యు ఎస్‌వో’ చిత్రం చిత్రీకరణ ప్రారంభమైంది. సహకార నగరలో జరిగిన చిత్రీకరణ సందర్భంగా నటీనటులపై హీరో కోమల్‌కుమార్ క్లాప్ ఇచ్చారు. హాస్యభరితమై చిత్రానికి రాజ్ మురళి దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్లుగా స్పందన సోమణ్ణ, విజయలక్ష్మీ కలబురగి నటిస్తున్నారు. చిక్కమగళూరు, హైదరాబాద్, మైసూరు తదితర ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరిస్తారు.


అభిమన్యు సన్‌ఆఫ్ కాశీనాథ్ చిత్రంలో అభిమన్యు, స్పందన సోమణ్ణ, విజయలక్ష్మీ కలబురగి

‘రాజు జేమ్స్‌బాండ్’ సిద్ధం

హాస్యభరితమైన ‘రాజు జేమ్స్‌బాండ్’ చిత్రం విడుదలకు సిద్ధమైంది. దీపక్ మధువనహళ్లి దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో గురునందన్, మృదులా, సాధుకోకిల, అచ్యుత్‌కుమార్, చిక్కణ్ణ, రవిశంకర్, జైజగదీశ్ తదితరులు నటిస్తున్నారు. థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకుడు రెండుగంటల పాటు నవ్వులతో మునిగిపోతారని, ఆవిధంగా చిత్రాన్ని నిర్మించినట్లు దర్శకుడు తెలిపారు.


రాజు జేమ్స్‌బాండ్ చిత్రంలో గురునందన్, మృదులా

బెంగళూరు
• బెంగళూరు • హోసూరు

ఆకట్టుకొన్న మహిళల బైక్ ర్యాలీ


బైక్‌ర్యాలీ ప్రారంభ వేడుకల్లో మహిళా రైడర్లు

బెంగళూరు (క్రీడలు) : తరుణి సంస్థ తరఫున వీఆర్ మాల్ ఆఫ్ ఆసియా, శ్రీవన్ సొసైటీ నేతృత్వంలో 'హర్ రైడ్ హర్ రూల్స్' పేరిట ఆదివారం మహిళలతో నిర్వహించిన బైక్ ర్యాలీ ఆకట్టుకొంది. తరుణి మార్కెటింగ్ మేనేజర్ ఉర్వశి కింగ్రాణి ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. ఫినిక్స్ మాల్ ఆఫ్ ఆసియా నుంచి ప్రారంభమైన ర్యాలీ యలహంక, బళ్లారి రోడ్డు మార్గంలో సాగింది. సంగీత కార్యక్రమంతో వారి ప్రతిభా సామర్థ్యాలను ప్రదర్శించి పలువురి మెప్పు పొందారు. కార్యక్రమంలో మహిళా బైకర్లు, కళాకారులు, ప్రసంగికులు పాల్గొన్నారు.

శంకరపురం వీధుల్లో ఆర్‌ఎస్‌ఎస్ జాతా


వాహనంపై పూలరేకులు చల్లుతున్న అభిమాని

బెంగళూరు (శివాజీనగర) : విజయదశమి వేడుకల్లో భాగంగా రాష్ట్రీయ స్వయం సేవక సంఘం కార్యకర్తలు శంకరపురం, జయనగర వీధుల్లో ఆదివారం జాతా నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ అశ్వత్థనారాయణ, విశ్వ నాయకుడు అశోక్, లోక్‌సభ సభ్యుడు తేజస్వీ సూర్య, ఎమ్మెల్యే రవి సుబ్రహ్మణ్య కవాతు చేశారు. జాతాకు ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు దీపక్ రమేశ్, సాయి కుమార్, వేదవ్యాస్ భట్ నేతృత్వం వహించారు. దారిలో భాజపా అభిమానులు, హిందూ సంఘాల ప్రతినిధులు పూల రేకులు చల్లుతూ స్వాగతించారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు కల్పించారు.

హోసూరు కబుర్లు

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

హోసూరు, న్యూస్‌టుడే : భారత్‌మాల రోడ్డు నిర్మాణ పనుల కారణంగా ఇబ్బంది పడుతున్న రైతుల సమస్యలను పరిష్కరించడానికి మాజీ ఎంపీ సి. నరసింహన్ హోసూరు, డెంకణికోట, తళి ప్రాంత బాధిత రైతులను కలిసి ఆదివారం బాగలూరు ప్రాంతంలోని మల్లసంద్రం, అట్టూరు, దేవీరపల్లిలో పరిశీలించారు. హోసూరు-కృష్ణగిరి జాతీయ రహదారిలోని వెల్‌ఫేర్ సభా ప్రాంగణంలో 14 పంచాయతీల రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో నరసింహన్, భాజపా జిల్లా అధ్యక్షుడు ఎం.నాగరాజు, ఉపాధ్యక్షులు శశిధరం శ్వేత రైతులతో చర్చించారు. భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు కేవలం రూ.6 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కర్ణాటకలో బాగలూరులో భారత్‌మాల రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు ఎక్కువ మొత్తంలో పరిహారం ఇస్తున్నారు. హోసూరు, డెంకణికోట ప్రాంత రైతులు రోడ్డుపై పడ్డారు. ఈ విషయాన్ని గమనించిన నరసింహన్ కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో రైతు సంఘాల ప్రతినిధులతో కలిసి ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. బాధిత రైతులు ఢిల్లీ వెళ్లడానికి అంగీకరించారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్రరెడ్డి, విఠల్‌రెడ్డి, వెంకటేష్, హరీష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మల్లసంద్రంలో రహదారి పనులు పరిశీలిస్తున్న నరసింహన్, తదితరులు


రైతులతో మాట్లాడుతున్న నరసింహన్

విశ్వశాంతి కోసం నవచండీయాగం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు నేతాజీ రోడ్డులోని రామాలయంలో రెండు రోజులుగా విశ్వశాంతి కోసం ఆలయ ప్రధాన అర్చకులు కేశవన్ నేతృత్వంలో నవ చండీయాగం వైభవంగా చేశారు. వేద పండితులు వేదాలను పఠిస్తూ హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్యకళాకారుల బృందం భరతనాట్యం చేశారు.


కేశవన్ నేతృత్వంలో హోమంలో వేద పండితులు

పోలీస్ అధికారిగా ముత్తమిజ్ శెల్వరాజ్


ముత్తమిజ్ శెల్వరాజ్

హోసూరు, న్యూస్‌టుడే : సిప్‌కాట్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ముత్తమిజ్ శెల్వరాజ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన ప్రకాష్ బదిలీ అయ్యారు. కొత్త సీఐ ఎస్పీ తంగదురై, హోసూరు ఏఎస్పీ అక్షయ సునీల్‌ను కలిశారు. పారిశ్రామిక వాడ, మత్తిగెరి ప్రాంతంలో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల కవాతు

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : జిల్లాలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలను విస్తృతం చేయాలనే ఉద్దేశంతో వందలాది మంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పట్టణంలో కవాతు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం రాష్ట్ర నలమూలల నుండి విచ్చేసిన వందలాది మంది కార్యకర్తలు చేతిలో కర్రలను పట్టుకొని, యూనిఫారాలతో ఊరేగింపుగా వీధుల్లో తిరిగారు. పెరేడ్‌కు విధాన పరిషత్ సభ్యులు కేఎస్ నవీన్ నేతృత్వం వహించారు.

ఫుట్‌బాల్ పోటీల్లో సౌత్‌యునైటెడ్ జట్టు గెలుపు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కర్ణాటక ఫుట్‌బాల్ సంఘం మైదానంలో ఆదివారం జరిగిన సూపర్ డివిజన్ లీగ్ ఫుట్‌బాల్ పోటీలో సౌత్ యునైటెడ్ జట్టు 4-2 గోల్స్ తేడాతో హెచ్‌ఏఎల్ క్లబ్‌జట్టుపై గెలుపొందింది. విజేత జట్టులో మహమ్మద్ అల్తాఫ్‌హుసేన్ మూడు గోల్స్ సాధించగా, ఇషాన్‌సాహి ఒక గోల్ చేశాడు. ఓటమి జట్టుకు తేజస్ రెండు గోల్స్ సాధించాడు. మరో పోటీలో బెంగళూరు క్లబ్ జట్టు జోష్వా డిసిల్వా సాధించిన మూడు గోల్స్ హ్యాట్రిక్‌తో బెంగళూరు క్లబ్ జట్టు 4-1 గోల్స్‌తో స్పోర్టింగ్‌క్లబ్ జట్టుపై గెలుపొందింది.

వర్షంతో జనజీవనం అస్తవ్యస్తం


విరిగిపడిన చెట్ల కొమ్మలు


మునిగిన సాయి లేఔట్


వాగును తలపిస్తున్న మైసూరు రోడ్డు కూడలి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెంగళూరు నగరంలో కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం ఉదయం వరకు వర్షం కురిసింది. దీంతో పలు ప్రదేశాల్లో రహదారులు వాగులను తలపించాయి. ఆదివారం సెలవు కావడంతో ఉద్యోగులు, కార్మికులు ఇళ్లకు పరిమితమయ్యారు. వర్షానికి ఎలక్ట్రానిక్ సిటీ, హోసూరు రోడ్డు, మైసూరు రహదారి, సిల్క్‌బోర్డు కూడలి తదితర రహదారుల్లో వాహనాలు నీట మునిగాయి. మైసూరు రహదారిలో కార్లు, ఆటోలు, బస్సు మునిగిపోవడంతో ఆకర వాహనాల సాయంతో వాటిని బయటకు లాగారు. దీంతో ఆ రహదారిలో వాహన సంచారం కొద్దిసేపు స్తంభించింది. పరప్పన అగ్రహార, సర్జాపురలను కలిపే రహదారి గుంతలమయమైంది. పట్టణగెరె మెట్రోస్టేషన్, రూపేనా అగ్రహార మెట్రోస్టేషన్ రహదారులు వానమీదలో మునిగాయి. సిల్క్‌బోర్డు కూడలి జలమయం కావడంతో వాహనాలు బయటకు పంపించడంతో పక్కన ఉన్న కాలువపై వేసిన రాళ్లను తొలగించారు. రెండు అడుగుల లోతులో వర్షం నీరు నిలబడింది. కృష్ణరాజపుర ప్రాంతంలో ఉన్న సాయి లేఔట్ మళ్లీ మునిగింది. నాలుగు రోజులు క్రితం నీరు నిలవగా యంత్రాల సాయంతో పాలికె సిబ్బంది బయటకు పంపించారు. రాత్రి కురిసిన వర్షానికి మళ్లీ ముంపునకు గురైంది. లేఔట్‌లోని ఐదు వందల ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికులు పాలకులపై మండిపడుతున్నారు. ఇళ్లలో ఉంటే వస్తువులు తడిసిపోయాయి. నీరు, ఆహారం కోసం ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఉదయం అగ్నిమాపక సిబ్బంది వచ్చి నీటిని యంత్రాల సాయంతో బయటకు పంపించడం ప్రారంభించారు. మైసూరు రోడ్డులోని జయరాం కూడలిలో కారు పోరూం నీటిలో మునిగింది. కెంగేరి, ఆర్ఆర్‌నగర ప్రాంతాల్లో పలు రహదారులు మునిగాయి. శాంతినగర, త్యాగరాజనగర, జయనగర, జేపీనగర, శ్రీనగర, విద్యారణ్యపుర, యలహంక, హెబ్బాళ్, యశ్వంతపుర, మల్లేశ్వరం రాజాజినగర, పీణ్యా, జాలహళ్లి, మహదేవపుర, బెళ్లందూరు తదితర ప్రాంతాల్లో ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరో రెండు రోజులు పాటు నగరంలో భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

కెంగేరి ప్రాంతంలో 122 మిల్లీమీటర్లు, ఆర్ఆర్ నగర 98 మిల్లీమీటర్లు, దొరసానిపాళ్య 62 మిల్లీమీటర్లు, రాజరాజేశ్వరినగర 59 మిల్లీమీటర్లు, హెమ్మిగెపుర 53.50 మిల్లీమీటర్లు, బొమ్మనహళ్లి 49 మిల్లీమీటర్లు, ఆరెకెరె 48.50 మిల్లీమీటర్లు, జక్కూరు 44 మిల్లీమీటర్లు, అంజనాపురలో 39 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు.


వాగుల మారిన హోసూరు రోడ్డు

గుండెల్లో దడ పుట్టిస్తున్న వాన


బి.కె.నగర కాలనీల్లో వాగులా రహదారి

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : నగరంలో కురుస్తున్న భారీ వర్షాలు మూరికివాడల ప్రజల గుండెల్లో దడపుడుతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వానకు లోతట్టు ప్రాంతాలైన కాతనగర, సిద్ధార్థనగర, కె.జి.హళ్లి జోబిడి, మత్తికెరె గుడిసెలు, తిండ్లు లోతట్టు కాలనీలు, సోమదేవనహళ్లి తదితర ప్రాంతాల్లో రహదారులు వాగుల్లా ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జోరువానకు ఇళ్ల నుంచి బయటకు రావటానికి ప్రజలు వెనుకంజవేస్తున్నారు. ఆదివారం కావటంతో ప్రజలు ఇళ్ళకే పరిమితమయ్యారు.

పేదలకు చీరలు పంపిణీ చేసిన అశోక్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని భారతీనగర నివాసుల సంఘం ఆదివారం ఇక్కడ నిర్వహించిన కార్యక్రమంలో విపక్ష నేత అశోక్, ఎమ్మెల్యే రఘు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తమ సభ్యుల సహకారంతో చీరలు కొనుగోలు చేశామని సంఘం అధ్యక్షుడు ఎన్ ఎస్ రవి తెలిపారు. స్థానిక మురికివాడల్లోని పలువురు మహిళలు చీరలు అందుకున్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న అశోక్, ఎమ్మెల్యే రఘు తదితరులు

అభివృద్ధి పనులతో ప్రజా విశ్వాసం

తుమకూరు, న్యూస్‌టుడే : ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో నిమగ్నమై అభివృద్ధి పనులు చేస్తే రాజకీయాల్లో చిరస్థాయిగా నిలుస్తారని సహకారశాఖ మంత్రి కె.ఎన్.రాజణ్ణ అభిప్రాయపడ్డారు. తుమకూరు నగరంలోని ఎంప్రెస్ కేపీఎస్ పాఠశాల సభా ప్రాంగణంలో ఆదివారం జిల్లా వాల్మీకి నాయకుల క్షేమాభివృద్ధి సంఘం, వాల్మీకి విద్యావర్ధక సంఘం, జిల్లా నాయక మహిళా సమాజం, శబరి మహిళా వాల్మీకి సహకార సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ తరగతుల్లో ఉత్తమ మార్కులు సాధించిన వాల్మీకి సమాజం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను మంత్రి, శాంతలా రాజణ్ణ తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేసినప్పుడే ప్రజల విశ్వాసం పొందవచ్చునన్నారు. బోయ సమాజం విద్యార్థులు జిల్లా స్థాయిలో 250 మంది 80 శాతానికి పైగా మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శిడ్లేకోణ వాల్మీకి గురుపీఠం సంజయ్‌కుమారస్వామీజీ దివ్యసాన్నిధ్యం వహించారు. కార్యక్రమంలో శిర మాజీ ఎమ్మెల్యే సాలింగయ్య, జడ్పీ మాజీ సభ్యుడు రామచంద్రప్ప, ఉపన్యాసకుడు ఎల్.పి. రాజు, ప్రముఖులు రాజకుమార్, గంగాధర్, ప్రతాప్ బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.


రామాయణం వేషధారులతో మంత్రి రాజణ్ణ

నేటి నుంచి సైన్స్ తరగతులు

తుమకూరు, న్యూస్‌టుడే : బిదరకట్టే గ్రామం సమీపంలో 240 ఎకరాల్లో నిర్మించిన తుమకూరు విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్ జ్ఞానసిరిలో సోమవారం నుంచి సైన్స్ తరగతులను ప్రారంభిస్తున్నట్లు ఉపకులపతి ఎం.వెంకటేశ్వరులు తెలిపారు. కొత్త క్యాంపస్‌లో ప్రత్యేక హాస్టల్ సౌకర్యాలు ఉన్నాయన్నారు. సైన్స్ విభాగంలో 12 కోర్సులకు సంబంధించిన తరగతులు, ల్యాబ్‌లు, విశాలమైన తరగతి గదులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 12 శాఖలను నూతన క్యాంపస్‌లోకి బదిలీ చేస్తామన్నారు. నూతన క్యాంపస్‌కు సంచరించడానికి విశ్వవిద్యాలయం నుంచి రెండు బస్సులు ఏర్పాటు చేశామని, ఆర్టీసీ బస్సులు కూడా వెళతాయన్నారు. ఇప్పటి వరకు రూ.42 కోట్లతో నిర్మించిన భవణాల్లో సైన్స్ తరగతులు ప్రారంభమవుతాయని, నిర్మాణాలు పూర్తి కావడానికి రూ. 175 కోట్లు అవసరం ఉందన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 15 అధ్యయన పీఠాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో ఫిలింసిటీ అకాడమీ స్థాపన కోసం కసరత్తులు చేస్తున్నట్లు ఉపకులపతి వివరించారు.


మాట్లాడుతున్న ఉపకులపతి వెంకటేశ్వరులు

స్వచ్ఛత సేవ కాదు.. బాధ్యత

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : ససిహిత్లు సముద్ర తీరంలో మంగళూరు విద్యాగిరి విద్యార్థులు స్వచ్ఛతా కార్యక్రమాన్ని చేపట్టారు. ఆళ్వాస్ ప్రతిష్ఠాన నిర్వహిస్తున్న వార్షిక చెరువుల సదస్సు సందర్భంగా ఆదివారం ససిహిత్లు సముద్రతీరంలో వ్యర్థాలను తొలగించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సంచుల్లో చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠాన ట్రస్టీ వివేక్‌ఆళ్వా మాట్లాడుతూ స్వచ్ఛత అనేది సేవగా అనుకోకూడదని, ఇది మనందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. చెరువు సమ్మేళనలో విదేశాలు, వేర్వేరు రాష్ట్రాల నుంచి విద్యాసంస్థలు, ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. అనంతరం మూడబిదిరే వెయ్యి స్థంబాల బసదిలో విద్యార్థులు, పరిశోధన విద్వాంసులు, అధ్యాపకులకు మూడబిదిరే జైన్‌మఠం ప్రతినిధి పండితాచార్యస్వామి నేతృత్వంలో ప్రశస్తి పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రతిష్టాన సభ్యులు, యంగ్ ఇండియన్స్‌కు చెందిన మధుకర్, శరణ్‌శెట్టి, ఆళ్వాస్ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు స్వచ్ఛతపై వివరిస్తున్న వివేక్‌ఆళ్వా


గుబ్బిలో గంజికేంద్రాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తులు వీరప్ప, నూరున్నీసా


విలేకరులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి, జిల్లాధికారి

అవినీతి రహిత సమాజం కావాలి

తుమకూరు, న్యూస్‌టుడే : సమాజంలో అవినీతిని కూకటివేళ్లతో పెకలించడమే లోకాయుక్త ధ్యేయమని ఉప లోకాయుక్త న్యాయమూర్తి బి.వీరప్ప స్పష్టం చేశారు. తుమకూరు ప్రభుత్వ అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి మూడు రోజులుగా జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించడానికి చర్యలు చేపట్టామన్నారు. గుబ్బి వీరణ్ణ కళాక్షేత్రంలో 299 ఫిర్యాదులకు విచారించి 80 కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. పందుల కాపరుల నివాస ప్రాంతాలను పరిశీలించి ప్రభుత్వం సూచించిన సాతేనహళ్లి ప్రాంతానికి తరలి వెళ్లాల్సిందిగా ఆ కుటుంబాలకు నచ్చజెప్పినట్లు వివరించారు. తాలూకా యంత్రాంగం ఏర్పాటు చేసిన గంజికేంద్రాన్ని పరిశీలించినట్లు ఆయన వివరించారు. సమావేశంలో జిల్లా న్యాయమూర్తి నూరున్నీసా, జిల్లాధికారి శుభాకల్యాణ్, ఎస్పీ అశోక్, లోకాయుక్త పోలీస్ అధికారి లక్ష్మీనారాయణ పాలికె కమిషనర్ అశ్విజ, అదనపు జిల్లాధికారి తిప్పేస్వామి, అధికారులు పాల్గొన్నారు.

నగదుగా మారిన చెక్కు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి ఇచ్చిన రూ.లక్ష చెక్కు నగదుగా మారిందని దాత, పారిశ్రామికవేత్త ఇడమకంటి లక్ష్మీరెడ్డి తెలిపారు. ఈమేరకు తనకు సమాచారం వచ్చిందన్నారు. చాలా మంది ప్రచారం కోసం చెల్లని చెక్కులు ఇస్తుంటారని, అలాంటి ప్రచారానికి దూరంగా తమ వంతు సాయాన్ని సీఎం సహాయనిధికి ఇచ్చినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

26న ఏకాదశ మానోత్సవం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన నృత్యకళాకారుడు యామిని కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఈనెల 26న నగరంలోని కోరమంగలలోని మేద్రై మందిరంలో ఏకాదశ మానోత్సవం నిర్వహిస్తున్నట్లు కూచిపూడి పరంపర ఫౌండేషన్ ట్రస్టు ప్రతినిధి ఆచార్య దీపా నారాయణన్ శశింద్రన్ తెలిపారు. నెల్లూరు కూచిపూడి నాట్య కళానిధి గురువేదాంతం మిదుమౌళి, తుమకూరు భారతనాట్య నృత్యకళాకారిణి బాలావిశ్వనాథ్‌లను సత్కరిస్తామన్నారు.

నవంబరు 3న వాల్మీకి జయంతి

పావగడ, న్యూస్‌టుడే : మహర్షి వాల్మీకి జయంతిని నవంబరు 3వ తేదీన జరుపుకోనున్నట్లు వాల్మీకి యువకుల సంఘం గౌరవాధ్యక్షుడు నరసింహమూర్తి తెలిపారు. పట్టణంలోని కుమారస్వామి కాలనీలోని వాల్మీకి దేవాలయ ఆవరణలో ఆదివారం వాల్మీకి జయంతి ముందస్తు సమాలోచనల సమావేశం జరిగింది. రాజనహళ్ళి, నిడిగల్లు వాల్మీకి స్వామీజీల సమక్షంలో అత్యంత ఆడంబరంగా జరుపుకోనున్నామని, పార్టీలకు అతీతంగా సముదాయ నాయకులు, ప్రజలు పర్వదినంగా భావించి వాల్మీకి జయంతిని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు పి. హెచ్. రాజేష్, విశ్రాంత ఉద్యోగి శ్రీనివాసనాయక, గుట్టహళ్ళి అంజినప్ప, వాల్మీకి యువకుల సంఘం అధ్యక్షుడు న్యాయవాది పి.ఎస్.నరసింహకృష్ణ, వాల్మీకి దేవాలయ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు ఈరణ్ణ, సముదాయ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు చోరుల మృతి

బెంగళూరు (గ్రామీణం) : చిత్రదుర్గ జిల్లా హిరియూరు తాలూకా కణజనహళ్లి గ్రామంలోని వక్క తోటలో శనివారం రాత్రి దొంగతనానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు విద్యుదాఘాతంతో మరణించారు. జయరామప్ప అనే రైతుకు చెందిన తోటలో శ్రీగంధం చెట్టు నరుక్కునేందుకు వచ్చిన వీరు మోటారు సమీపంలోని విద్యుత్తు తీగను తాకి మృతి చెందారు. ఆదివారం ఉదయం వీరి మృతదేహాలను గుర్తించారు. వీరిద్దరూ మధ్యప్రదేశ్‌కు చెందిన మోహిత్ (24), కవర్త (38)గా ప్రాథమిక విచారణలో గుర్తించామని ఐమంగల ఠాణా ఇన్‌స్పెక్టర్ ఎన్.గుడ్డప్ప తెలిపారు. మృతదేహాలను మరణోత్తర పరీక్ష నిమిత్తం హిరియూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కోరుకోకున్నా వరించిన టికెట్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : శిగ్గావ్ ఉప ఎన్నికల టికెట్ తన కుమారుడు భరత్ బొమ్మైకు ఇవ్వవద్దని మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై చేసుకున్న విన్నపాన్ని పార్టీ అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోలేదు. టికెట్ కేటాయించి, భరత్‌ను గెలిపించుకు రావాలని బాధ్యతలను ఆయనపై మోపింది. ఉప ఎన్నికల్లో భరత్‌ను పోటీలో దించాలని నియోజకవర్గంలోని కార్యకర్తలు ఒత్తిడి చేస్తూ వచ్చారు. వ్యక్తిగత కారణాలతో తన కుమారుడ్ని బరిలో దించకూడదని బొమ్మై భావించారు. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తం తిరుగుతూ భరత్ తండ్రి కోసం ప్రచారం చేశారు. ఆ అనుభవమే సరిపోతుందని పార్టీ అధిష్ఠానం భావించింది. ఈసారి ఉప ఎన్నికలు జరిగే మూడు నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా భాజపా, జనతాదళ్ కార్యకర్తలు, నాయకులు శ్రమిస్తారని బసవరాజ బొమ్మై తెలిపారు. భరత్ బొమ్మై మల్లేశ్వరంలోని భాజపా ప్రధాన కార్యాలయానికి ఆదివారం వచ్చారు. భరతమాత చిత్రపటం, జగన్నాథ జోషి విగ్రహాలకు పుష్పార్చన చేశారు. పార్టీ సీనియరు నాయకుల ఆశీస్సులు అందుకున్నారు. ఎమ్మెల్సీ చలువాది నారాయణ స్వామిని ఆయన ఇదే సందర్భంలో సత్కరించారు. సండూరు నుంచి బంగారు హనుమంతుకు భాజపా టికెట్ కేటాయించింది. సండూరు నుంచి పోటీ చేసేందుకు భాజపా నుంచి 20మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని పార్టీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర తెలిపారు. యువ నాయకుడు హనుమంతుకే టికెట్ ఇవ్వాలని పార్టీ పెద్దలు తీర్మానించారు. తిరుగుబాటు అభ్యర్థులు ఎవరూ ఉండరని, సండూరు, శిగ్గావ్‌లో తమ అభ్యర్థుల గెలుపు నల్లేరుపై నడక అవుతుందని విజయేంద్ర ధీమా వ్యక్తం చేశారు.


చలువాది నారాయణస్వామిని సత్కరిస్తున్న భరత్

త్రోబాల్‌లో శారదా విద్యాపీఠం విద్యార్థుల సత్తా

పావగడ, న్యూస్‌టుడే : పట్టణంలోని శారదా విద్యాపీఠం పాఠశాల విద్యార్థులు త్రోబాల్ పోటీల్లో రాణించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. శిరా తాలూకా భువనహళ్ళిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బాలురు ప్రథమ స్థానం, బాలికలు ద్వితీయ స్థానం గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల కరెస్పాండెంట్ ఎన్.సి.నాగభూషణ, ప్రధానోపాధ్యాయుడు బాలరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు వీరభద్రయ్య, తదితరులు అభినందించారు.


విజేతలతో ఉపాధ్యాయులు

అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డులు

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : దాసరహళ్లి నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డులు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే ఎస్.మునిరాజు తెలిపారు. ఇక్కడ ఆదివారం శెట్టిహళ్లి వార్డు పరిధిలోని 87 నిరుపేద కుటుంబాలకు ఎమ్మెల్యే రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో తమ స్వంత గ్రామాలకు వెళ్లి తిరిగి ఇక్కడికి వచ్చిన పేదప్రజలకు అధికారులు రేషన్‌కార్డులు తొలగించారన్నారు. సమస్యను మంత్రి మునియప్ప దృష్టికి తీసుకెళ్లి రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దాసరహళ్లి భాజపా అధ్యక్షుడు సోమశేఖర్, వార్డు అధ్యక్షుడు సురేష్, బీబీఎంపీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


శెట్టిహళ్లిలో ప్రజలకు రేషన్‌కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మునిరాజు

వెనుకబడిన వర్గాలకు విద్య చాలా ముఖ్యం

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : వెనుకబడిన వర్గాల్లో ఆర్య ఈడిగ సామాజిక వర్గం ఆర్థికంగా వెనుకబడి ఉందని, వీరు అభివృద్ధి చెందాలంటే పిల్లలను విద్యావంతులను చేయడం చాలా ముఖ్యమని జిల్లా బాధ్య మంత్రి డి.సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన ఇక్కడ నారాయణగురు జయంతి వేడుకలు, ప్రతిభావంత విద్యార్థులు, సాధకుల సత్కార కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేటి యువకులు తమ కుల వృత్తిని కొనసాగించడానికి ఇష్టపడటం లేదన్నారు. ప్రతిభావంత విద్యార్థులు, వివిధ రంగాల్లో సేవలందించిన సాధకులను సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్, ఆధ్యాత్మిక గురువులు విఖ్యాతనందస్వామి, రేణుకానందస్వామి, ఆర్య ఈడిగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మేగౌడ, తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభ వేడుకల్లో బాధ్యమంత్రి సుధాకర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, తదితరులు

ఆకట్టుకొన్న వస్తు ప్రదర్శన

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెంగళూరు అంతర్జాతీయ వస్తు ప్రదర్శనశాలలో ఏసీఈ టెక్ ఇళ్ల నిర్మాణాల వస్తుప్రదర్శన ఆదివారం ముగిసింది. తలుపులు, పైపులు, ఇటుకలు, విద్యుత్తుతీగలు తదితర వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. సుధాకర్ గ్రూపు తయారు చేసే నాణ్యమైన నీటి పైపులను ప్రదర్శనలో ఉంచారు. భవనాలకు ఉపయోగించాల్సిన వస్తువులు, తాగునీటి పైపుల గురించి నిర్వాహకులు వివరించారు. పీవీసీ తలుపులు గురించి సందర్శకులు ఎక్కువ మంది వాకబ్ చేశారని ఆగ్రూపు డైరెక్టర్లు సుధాకర్, సంజయ్ తెలిపారు.



ప్రదర్శనలో స్టాల్స్ వద్ద సందర్శకులు

ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయండి



సిద్ధరామయ్యతో కవితా లంకేశ్

బెంగళూరు (శివాజీనగర్) : సీనియర్ విలేకరి గౌరీ లంకేశ్ హత్య కేసు విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాలని ఆమె సోదరి కవితా లంకేశ్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఆమె ఆదివారం భేటీ అయి వినతిపత్రాన్ని అందజేశారు. తన సోదరి హత్యకు గురై ఏడేళ్లు దాటిందని, హంతకులను అరెస్టు చేసి, ఆరేళ్లయినా, ఇప్పటి వరకు విచారణ పూర్తి కాలేదని గుర్తు చేశారు. కొందరు నిందితులకు ఇప్పటికే బెయిలు రావడంతో బయటకు వచ్చేశారని తెలిపారు. న్యాయకోవిదులతో పాటు మంత్రివర్గ సమావేశంలో అంశాన్ని చర్చించి తదుపరి నిర్ణయాన్ని తీసుకుంటామని సిద్ధరామయ్య ఆమెకు భరోసా ఇచ్చారు.

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు

అపురూపం..శ్రీరామాంజనేయం రూపం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : కర్ణాటకలో అతి పెద్ద శ్రీరామాంజనేయ విగ్రహానికి శ్రీరామసేవా సమితి ప్రతినిధులు ఆదివారం పూజలు చేశారు. గణపతి పూజ, విఘ్నజ్ఞ ప్రార్థన, దేవతా ప్రార్థన, కలశ ప్రతిష్ఠాపన నేటి (సోమ) నుంచి ప్రారంభం కానున్నాయి. పీఠంతో కలిపి ఈ విగ్రహం 63 అడుగుల ఎత్తు ఉండగా, కర్ణాటకలో ఈ తరహా విగ్రహం ఇదే ఎత్తయినది. విగ్రహ వర ప్రతిష్ఠాపన పూజలు, హోమాలను సిద్ధగంగ మఠాధిపతి సిద్ధలింగ మహాస్వామి చేస్తారు. బుధవారం సాయంత్రం వరకు ప్రతిష్ఠాపన కార్యక్రమం, పూజలు, హోమాలు కొనసాగుతాయని సమితి ప్రతినిధులు తెలిపారు.



రాముని పాదాల వద్ద ఆంజనేయుడు

సమ్మేళనంలో ప్రతిపాదనలకు ఆమోదం

రాయచూరు, న్యూస్‌టుడే : లింగసూగూరు తాలూకా హట్టిలో జరిగిన సీపీఎం తాలూకా సమ్మేళనంలో పలు కీలక తీర్మానాలు చేశారు. నూతనంగా ఎన్నికైన తాలూకా అధ్యక్షుడు రమేశ్ వీరాపూరు ప్రతిపాదించగా ప్రతినిధులు ఆమోదం తెలిపారు. పోడు భూములను సేద్యం చేస్తున్న రైతులకు పట్టాలు మంజూరు చేయాలని, సాగునీటి పారుదల ప్రాంతాన్ని విస్తరించాలని, హట్టి బంగారు గనుల కంపెనీలో ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేసేటప్పుడు స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. హట్టి కార్మికులకు మెడికల్ అన్ ఫిట్ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని, విద్యార్హత ఆధారంగా ఉద్యోగ గ్రేడ్ కల్పించాలన్నారు. లింగసూగూరు, హట్టి, ముదగల్‌లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, హట్టిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే పోరాటానికి సిద్ధం కావాలని నిర్ణయించారు.



తీర్మానాలు చదువుతున్న రమేశ్

చెన్నపట్టణ చిక్కేదెవరికో?

● కుమారకే అభ్యర్థి ఎంపిక బాధ్యత ● కాంగ్రెస్‌లో అంతర్మథనం
● తాజా, మాజీ ముఖ్యమంత్రులకు ప్రతిష్ఠాత్మకం



చెన్నపట్టణ బొంగరాన్ని తిప్పుతున్న స్థానికుడు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: చెన్నపట్టణ ఉప ఎన్నిక అభ్యర్థి ఎంపికను కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిపై ఉంచామని భాజపా పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప వెల్లడించారు. ఆ స్థానం నుంచి పోటీ చేసేందుకు మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ మునిగాళ్లపై వేచి చూస్తున్నారు. తాను రాజీనామా చేయడంతో వచ్చిన చెన్నపట్టణ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో తన కుమారుడు నిఖిల్‌ను లేదా భార్య అనితను బరిలో నిలపాలని కుమారస్వామి భావించారు. యోగేశ్వర్ తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేసినా, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ పోటీ చేసినా, ఓట్లు చీలి తన భార్య లేదా కుమారుడు గడ్డు పరిస్థితిని ఎదుర్కోనవలసి వస్తుందని కుమార అంచనాకు వచ్చారు. సామ, దామ, బేధ, దండోపాయాలను ప్రదర్శించి చెన్నపట్టణను, సండూరు నియోజకవర్గాన్ని తన ఖాతాలో వేసుకునేందుకు కాషాయ పార్టీ పావులు కదుపుతోంది. సీపీ యోగేశ్వర్ తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేయకుండా కట్టడి చేయాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరేందుకు భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర శనివారం రాత్రి హస్తినకు బయలుదేరారు. శిగ్గావ్‌లో తమకు పట్టు ఉందని, అక్కడ భరత్ బొమ్మై గెలుపుపై అనుమానం లేదని భాజపా ధీమాతో ఉంది. సండూరులో మాజీ మంత్రులు గాలి జనార్ధన రెడ్డి, బి.శ్రీరాములు సహకారం, గతంలో తమ ఆప్తులు, కార్యకర్తలతో గట్టెక్కవచ్చని భావిస్తోంది. దళ్ నుంచి సీనియరు కార్యకర్త మంజునాథ్‌ను పోటీలో నిలపాలని నిఖిల్ ఇప్పటికే సూచనలు చేశారు.

కాంగ్రెస్ ఆచితూచి..

చెన్నపట్టణ నుంచి శివకుమార్ తన పెద్ద కుమార్తె ఐశ్వర్యను కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగుతారని ప్రచారం జరిగింది. తాను కూడా పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని మాజీ ఎంపీ, శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ ఆదివారం ప్రకటించారు. చెన్నపట్టణ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సీపీ యోగేశ్వర్ పోటీ చేస్తారని కుమారస్వామి ఆదివారం సాయంత్రం బాంబు పేల్చారు. కుమారస్వామి ఆచితూచి తీసుకునే నిర్ణయంతో తమ గెలుపు అవకాశాలకు గండి కొడుతుందని కమలనాథులు భావిస్తున్నారు. బళ్లారిలో ఎంపీ అభ్యర్థి ఎంపికకు వాల్మీకి కార్పొరేషన్ నిధులను వాడారని భాజపా ఇప్పటికే ఆరోపణలు చేసింది. ముడాలో అక్రమాలపై చెన్నపట్టణ నియోజకవర్గం మార్గంలో ఉద్యాననగరి నుంచి రాచనగరి వరకు పాదయాత్రను నిర్వహించింది. తాము చేసిన పోరాటమే సండూరు, చెన్నపట్టణల్లో గెలుపునకు బాటలు వేస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. చెన్నపట్టణలో గెలుపు సాధించి దళ్ కోట గోడల్ని బద్ధలు కొట్టాలని ఉప ముఖ్యమంత్రి శివకుమార్ వేచి చూస్తున్నారు. భాజపాకు రెండు నియోజకవర్గాలను విడిచి పెట్టామని, తమకు చెన్నపట్టణలో అభ్యర్థి ఎంపికకు అనుమతించాలని దళపతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు చెన్నపట్టణలో తిరుగుబాటు అభ్యర్థి పోటీ చేస్తే పరిస్థితి ఏమిటని భాజపా, దళ్ నాయకులను మరోసారి ఆలోచించుకునేలా చేస్తోంది. రెండు నియోజకవర్గాలకు భాజపా అభ్యర్థులను ప్రకటించి ముందంజలో ఉండగా, కాంగ్రెస్ పార్టీ ఏ క్షణంలో అయినా తన అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. మూడు నియోజకవర్గాల్లో గెలుపు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మాజీ ముఖ్యమంత్రులు హెచ్‌డీ కుమారస్వామి, బసవరాజ బొమ్మైకు ప్రతిష్ఠగా మారాయి.

ఉల్లి రైతులకు కన్నీరే మిగిలింది..



కడగందొడ్డిలో ఉల్లిగడ్డలను ఏరుతున్న రైతులు



పాడైన ఉల్లిని చూపిస్తున్న లక్ష్మణగౌడ

రాయచూరు, న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం జిల్లాలోని ఉల్లి రైతులకు కన్నీరు మిగిల్చింది. భారీవర్షం కారణంగా కోత దశకు వచ్చిన పంట నీట మునిగింది. చేతికి రావాల్సిన ఉల్లిపాయి నేల పాలు కావడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. రాయచూరు తాలూకాలోని చంద్రబండ, గిల్లేసూగూరు ఫిర్కాల పరిధిలో, దేవదుర్గ, లింగసూగూరు తాలూకాల్లో వేలాది ఎకరాల పంట పాడైంది. గతేడాదితో పోలిస్తే ఈ సారి సకాలంలో వానలు పడ్డాయి. జూన్ నెలలో విత్తనాటారు. ఈ నెలాఖారుకు కోతలకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఎకరాకు 50 క్వింటాళ్లపైనే దిగుబడి వస్తుందని అంచనా వేశారు. విపరీతంగా కురిసిన వానతో ఒక క్వింటాళ్ కూడా చేతికి దక్కడం అనుమానమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయచూరు తాలూకా చంద్రబండ పరిధి గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా లెక్కించారు. తాలూకాలోని మెట్ట రైతులకు ఉల్లి ప్రధాన పంట. ఎకరాకు రూ.50 వేలు ఖర్చు చేశారు. రబీ పంటకు సిద్ధమయ్యేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో అయోమయంలో పడ్డారు. నెల రోజులుగా మార్కెట్‌లో కిలో ఉల్లి ధర రూ.40 ఉంది. ఈ ధర లభిస్తుందని ఆశించిన అన్నదాతలకు ప్రస్తుత పరిస్థితి మింగుడు పడటం లేదు.

పరిహారం అందించి ఆదుకోవాలి

కనీవిని ఎరుగని నష్టం జరిగింది. ప్రభుత్వం పరిహారం చెల్లిస్తేనే రైతు నిలదొక్కుకుంటారు. వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యానవనాల శాఖ అధికారులు నష్టాన్ని గణించేందుకు సంయుక్త సమీక్ష నిర్వహించాలి. తడిసిన ఉల్లిగడ్డను రాయచూరు మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. వాహనాల్లో అమ్ముకుంటున్న వారి వద్ద ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఆర్థిక చేయూత ఇవ్వాలి. **లక్ష్మణగౌడ (జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు)**

ప్రతి గ్రామంలో ఒకరు అధికారి కావాలి



ఉపన్యాసం చేస్తున్న వెంకన్న

రాయచూరు, న్యూస్‌టుడే : కల్యాణ కర్ణాటకలోని ప్రతి గ్రామం నుంచి కనీసం ఒకరైనా ఉన్నతాధికారి కావాలని ప్రభుత్వ ప్రథమ శ్రేణి కళాశాల ప్రిన్సిపల్ వెంకన్న ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేయనున్న 50 వేల ఉద్యోగాల పోటీ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు కల్యాణ కర్ణాటక కెరియర్ అకాడెమీ, జి.కుమారనాయక్ అభిమానుల సంఘం సంయుక్తంగా ఆదివారం ఇక్కడి రంగమందిరంలో సదస్సు ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఉద్యోగాల సాధనకు శ్రమిస్తున్న సంస్థలకు సహకరించాలని కోరారు. ఉద్యోగాలు పొందేందుకు ఉన్నత పాఠశాల స్థాయి నుంచి ఇస్తున్న ప్రేరణ తప్పక ఫలితాన్ని ఇస్తుందన్నారు. కుమారనాయక్ అభిమానుల సంఘం ప్రధాన కార్యదర్శి బాబురావు మాట్లాడుతూ ఐదువేల మంది యువతకు శిక్షణ ఇచ్చి, వీరిలో కనీసం 500 మంది ఉద్యోగాలు తెచ్చుకోవాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు వివరించారు. ఉద్యోగ సంపన్నుల వ్యక్తులు పార్శ్వనాథ్, మల్లప్ప, రాజగోపాల్, రాజేష్ ఉపన్యాసం చేశారు. సదస్సుకు జిల్లా నలుమూల నుంచి 800 మంది యువతీ యువకులు హాజరయ్యారు.

కోరుకోకున్నా వరించిన టికెట్



చలువాది నారాయణస్వామిని సత్కరిస్తున్న భరత్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: శిగ్గావ్ ఉప ఎన్నికల టికెట్ తన కుమారుడు భరత్ బొమ్మైకు ఇవ్వవద్దని మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై చేసుకున్న విన్నపాన్ని పార్టీ అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోలేదు. టికెట్ కేటాయించి, భరత్‌ను గెలిపించుకు రావాలని బాధ్యతలను ఆయనపై మోపింది. ఉప ఎన్నికల్లో భరత్‌ను పోటీలో దించాలని నియోజకవర్గంలోని కార్యకర్తలు ఒత్తిడి చేస్తూ వచ్చారు. వ్యక్తిగత కారణాలతో తన కుమారుడ్ని బరిలో దించకూడదని బొమ్మై భావించారు. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తం తిరుగుతూ భరత్ తండ్రి కోసం ప్రచారం చేశారు. ఆ అనుభవమే సరిపోతుందని పార్టీ అధిష్ఠానం భావించింది. ఈసారి ఉప ఎన్నికలు జరిగే మూడు నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా భాజపా, జనతాదళ్ కార్యకర్తలు, నాయకులు శ్రమిస్తారని బసవరాజ బొమ్మై తెలిపారు. భరత్ బొమ్మై మల్లేశ్వరంలోని భాజపా ప్రధాన కార్యాలయానికి ఆదివారం వచ్చారు. భరతమాత చిత్రపటం, జగన్నాథ జోషి విగ్రహాలకు పుష్పార్చన చేశారు. పార్టీ సీనియరు నాయకుల ఆశీస్సులు అందుకున్నారు. ఎమ్మెల్సీ చలువాది నారాయణ స్వామిని ఆయన ఇదే సందర్భంలో సత్కరించారు. మరోవైపు సండూరు నుంచి బంగారు హనుమంతుకు భాజపా టికెట్ కేటాయించింది. సండూరు నుంచి పోటీ చేసేందుకు భాజపా నుంచి 20మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని పార్టీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర తెలిపారు. యువ నాయకుడు హనుమంతుకే టికెట్ ఇవ్వాలని పార్టీ పెద్దలు తీర్మానించారు. తిరుగుబాటు అభ్యర్థులు ఎవరూ ఉండరని, సండూరు, శిగ్గావ్‌లో తమ అభ్యర్థుల గెలుపు నల్లేరుపై నడక అవుతుందని విజయేంద్ర ధీమా వ్యక్తం చేశారు.

రెండు గంటలే అవకాశం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఈ ఏడాది దీపావళి పండగ రోజు రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే బాణసంచా కాల్చేందుకు అవకాశం కల్పిస్తున్నామని పర్యావరణ, అటవీ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే తెలిపారు. కాలుష్యకారకం కాని హరిత బాణసంచా విక్రయాలకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. పెద్ద చప్పుడు, వెలుగులు, పొగను వెలువరించే బాణసంచా విక్రయించినా, కాల్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణసంచా విక్రయాలకు అనుమతి తీసుకునే వారి నుంచి హరిత బాణసంచా మాత్రమే విక్రయిస్తామని ముందస్తు హామీ పత్రాన్ని తీసుకుంటామని స్పష్టం చేశారు.

బాంబు బెదిరింపు

బెళగావి, న్యూస్‌టుడే : సాంబ్రా విమానాశ్రయాన్ని పేల్చి వేస్తామంటూ వచ్చిన ఇ-మెయిల్ కలకలాన్ని సృష్టించింది. విమానాశ్రయం డైరెక్టర్ త్యాగరాజ్‌కు ఇ-మెయిల్ వచ్చింది. ఆయన సూచనలతో బాంబు నిష్క్రియదళం, శ్వానదళం సిబ్బంది విమానాశ్రయాన్ని క్షుణ్ణంగా గాలించి, అది ఉత్తుత్తి బెదిరింపుగా గుర్తించారు. ముందు జాగ్రత్త చర్యగా విమానాశ్రయానికి అదనపు భద్రత కల్పించారు. ప్రాథమిక దర్యాప్తులో బెదిరింపు ఇ-మెయిల్ చెన్నై నుంచి వచ్చిందని మారిహాళ ఠాణా పోలీసులు గుర్తించారు.

డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారు

గదగ, న్యూస్‌టుడే : త్వరలోనే డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని నొణవినకెరె కాడసిద్ధేశ్వర మఠాధిపతి కరివృషభ రాజదేశికేంద్ర శివయోగీశ్వర శివాచార్య స్వామి పేర్కొన్నారు. లక్ష్మేశ్వర ముక్తి మందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముక్తిమందిరంలో త్రికోటి లింగ ప్రతిష్ఠాపనలో జాప్యం జరుగుతోందన్నారు. త్వరలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే శివకుమార్ త్రికోటి లింగ ప్రతిష్ఠాపన చేస్తారని తెలిపారు. ముడాలో అక్రమాలకు సంబంధించి ముఖ్యమంత్రి స్థానానికి రాజీనామా చేయాలని విపక్ష నేతలు డిమాండ్ చేయడం, మరో వైపు ఈడీ దర్యాప్తు తదితర పరిణామాలు జరుగుతున్న ఈ సమయంలో శివాచార్య స్వామి ప్రత్యేకత సంతరించుకున్నాయి.

అర్ధరాత్రి వరకు సోదాలు

మైసూరు, న్యూస్‌టుడే: మైసూరు అభివృద్ధి ప్రాధికారలో జరిగిన అక్రమాల దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు శనివారం అర్ధరాత్రి 2.30 వరకు సోదాలు నిర్వహించారు. శుక్రవారం దాడి, శనివారం అర్ధరాత్రి వరకు నిర్వహించిన సోదాల్లో పలు దాఖలాలను పరిశీలించారు. రెండు హార్డ్ డిస్కులు, కొన్ని దస్త్రాలను జప్తు చేసుకున్న అధికారులు వాటిని బెంగళూరు శాంతినగర కార్యాలయంలో భద్రపరిచారు. సిద్ధరామయ్య భార్య పార్వతి ముడాకు ఇచ్చిన పొలం, బదులుగా ఆమెకు కేటాయించిన 14 ఇంటి స్థలాలకు చెందిన ఒరిజినల్ పత్రాలు కూడా ఈడీ జప్తు చేసుకున్న దస్త్రాల్లో ఉన్నాయి.

నవంబరు 10న ఆరాధనోత్సవం

మాన్వి, న్యూస్‌టుడే : తాలూకాలోని చికల్‌పర్వి గ్రామం వద్ద తుంగభద్ర నది తీరం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం, విజయదాసుల కట్ట వద్ద విజయదాసుల ఆరాధనోత్సవాన్ని నవంబరు 10న నిర్వహిస్తున్నట్లు మఠం నిర్వాహకులు వెల్లడించారు. మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం సుబుధేంద్రతీర్థ శ్రీపాదంగళ్ మూలరామ సంస్థాన పూజ చేస్తారు. విజయదాసుల నూతన వెండి ఉత్సవ విగ్రహాన్ని మఠానికి సమర్పిస్తారు. విజయదాసుల కట్ట వద్ద నవంబరు 13 వరకు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

నీర్‌మాన్వి యల్లమ్మదేవి జాతర

మాన్వి, న్యూస్‌టుడే : దీపావళి పాడ్యమి సందర్భంగా నవంబరు 1 నుంచి 3 వరకు నీర్‌మాన్వి యల్లమ్మదేవి చిన్నజాతర నిర్వహిస్తున్నట్లు దేవస్థాన సమితి అధ్యక్షుడు, తహసీల్దార్ రాజు ఫిరంగి తెలిపారు. సోమవారం టెంకాయల సగటు వ్యాపారం, మంగళహారతి, టెంకాయలు కొట్టేందుకు, దుకాణాలు నెలకొల్పుకునేందుకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వ్యాపారులు సోమవారం ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో టెండర్ ప్రక్రియలో పాల్గొనవచ్చునని తెలిపారు.

నేడు పోలీస్ అమరవీరుల దినోత్సవం

రాయచూరు, న్యూస్‌టుడే : పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని సోమవారం పోలీస్ మైదానంలో నిర్వహిస్తారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. ముఖ్య అతిథిగా జిల్లా పాలనాధికారి కె.నితీష్ హాజరవుతారు. ఎస్పీ పుట్ట మాదయ్య, ఏఎస్పీలు శివకుమార్, హరీష్ పాల్గొంటారని ఎస్పీ కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది.

తగ్గిన సిటీ బస్సులు - ప్రయాణికులకు తిప్పలు



బస్టాండ్‌లో సిటీ బస్సు వద్ద రద్దీ



వేచి ఉన్న ప్రయాణికులు

రాయచూరు, న్యూస్‌టుడే : ప్రయాణికులు పెరిగితే సహజంగానే బస్సుల సంఖ్యను రెట్టింపు చేస్తారు. రాయచూరు ఆర్టీసీ అధికారులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. సగానికి కుదించడంతో సకాలంలో బస్సులు రాక ప్రజలు విసిగిపోతున్నారు. వేచి ఉండలేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం రాయచూరులో తిరిగేందుకు పాతికకు పైగా బస్సులను ప్రారంభించారు. నవోదయ కళాశాల-రిమ్స్-యరమరాస్, బస్టాండ్ నుంచి వాసవినగర్, బోళమానదొడ్డి రహదారి, దేవినగర్, అస్కిహాళ్, రాంపూర్ వరకు సంచరించేవి. ప్రయాణానికి అనువుగా ఉన్నందున నగర పౌరుల్లో హర్షం వ్యక్తమైంది. ముఖ్యంగా శివారు కాలనీల నివాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. ఆటోఛార్జితో పోలిస్తే బస్సుల్లో ధర తక్కువగా ఉండడంతో చాలా మంది ప్రయాణానికి ఆసక్తి కనబరచారు. దాంతో ప్రతి బస్సు కిక్కిరిసి పోయేది. ఏడాది నుంచి క్రమేపి తగ్గించారు. వీటిని మంత్రాలయం, సిరివార, దేవసూగూరుకు తిప్పుతున్నారు. నగరానికి కేటాయించిన వాటిని దూరంగా ఉన్న ప్రాంతాలకు మళ్లించడంపై పౌరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం వస్తున్నా ఎందుకు పట్టణంలో తిప్పడం లేదో అంతుబట్టడం లేదు. జనసంఖ్య పెరగడం వల్లనే రాయచూరు నగరసభను నగర పాలక సంస్థగా మార్చటానికి ప్రభుత్వం ఆమోదించింది. కనుక రద్దైన వాటిని పునరుద్ధరించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

నిస్వార్థంగా జీవించాలని హితవు



సందేశాన్ని విన్పిస్తున్న బద్రముని

రాయచూరు, న్యూస్‌టుడే : జైన్ శ్రావక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గంజ్ కల్యాణ మంటపంలో గురుదేవ పుష్కర ముని జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. సాన్నిధ్యం వహించిన గురుదేవ బద్రముని మాట్లాడుతూ మనిషి అత్యాశను వీడి నిస్వార్థంగా ఉంటూ జీవితాన్ని సార్థకత చేసుకోవాలని సందేశాన్ని ఇచ్చారు. ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో భాగస్వామం కావాలని కోరారు. మానవుడి ఆశకు అంతు లేదని చెబుతూ దురాశ దుఃఖానికి హేతువు కాగలదని గ్రహించాలన్నారు. అందరి శ్రేయస్సును కోరి సన్మార్గంలో నడవాలని బోధించారు. శ్రావక సంఘం అధ్యక్షుడు శాంతిలాల్ మూతా, ప్రతినిధులు నరేంద్ర మూతా, గౌతమ్, కుమల కుమార్ జైన్ పాల్గొన్నారు.

ఉద్యాన నగరిపై వరుణాస్త్రం

కొనసాగుతున్న అల్పపీడన ప్రభావం



మైసూరు రోడ్డులో నిలిచిన వర్షం నీరు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : శివమొగ్గ, చిక్కమగళూరు జిల్లాల్లో భారీ వర్షాలు కొనసాగాయి. పూలు, పండ్ల తోటలు, వక్క, కొబ్బరి తోటలు దెబ్బ తిన్నాయి. పట్టణాలు-గ్రామాలను అనుసంధానం చేసే చిన్న వంతెనలు వరద నీటిలో మునిగాయి. చిక్కమగళూరు దత్తపీఠం రోడ్డులో 3 అడుగుల ఎత్తులో నీరు నిలిచింది. నేడు కూడా ఈ రెండు జిల్లాలలో భారీ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. ఇప్పటికే ఆయా జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు, జలాశయాలు పూర్తిగా నిండాయి. బెంగళూరులో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు రహదారులు జలమయం అయ్యాయి. మైసూరు రోడ్డు, కెంగేరి, మడివాళ, రూపేన అగ్రహార, జైరామ్ కూడలి, యలహంకల్లో రహదారుపై నీరు నిలిచింది. నేటి (సోమ) నుంచి వారం పాటు మల్నాడు, తీర ప్రాంత జిల్లాలు, బళ్లారి, విజయనగర, దావణగెరె, చిత్రదుర్గ, చిక్కబళ్లాపుర, తుమకూరు, కోలారు, దావణగెరె జిల్లాలో ఎల్లో అలర్ట్ ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

సిద్ధుకు తాఖీదులు జారీ చేసేందుకు ఈడీ సిద్ధం

మైసూరు : మైసూరు నగర అభివృద్ధి ప్రాధికారలో చోటు చేసుకున్న అక్రమాలకు సంబంధించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, కుమారుడు డాక్టర్ యతీంద్రలకు తాఖీదులు జారీ చేసేందుకు ఈడీ అధికారులు సిద్ధమయ్యారు. ఈ కేసులో సిద్ధరామయ్యను ఏ1గా, ఆయన భార్య పార్వతి ఏ2గా ఉన్నారు. సీఎం బావమరిది, ఏ3 మల్లికార్జున స్వామిని లోకాయుక్త అధికారులు ఇప్పటికే ఒకమారు విచారణ చేశారు. ఆయన భూమిని విక్రయించిన దేవరాజును లోకాయుక్తతో పాటు, ఈడీ అధికారులు కూడా విచారణ చేశారు. ముడా కార్యాలయంలో దస్త్రాలు, హార్డ్ డిస్కులను ఈడీ ఇప్పటికే జప్తు చేసుకుంది. కెసెరె గ్రామంలో మూడు ఎకరాల 16 గుంటల భూమిని ముడాకు పార్వతి అందజేశారు. దాని బదులుగా 14 ఇళ్ల స్థలాలను విజయనగర లేఅవుట్‌లో తీసుకున్నారు. భూమి ఇచ్చిన చోటు కాకుండా, ఖరీదైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలను తీసుకునేందుకు సిద్ధరామయ్య తన పరపతిని వినియోగించారని విపక్షాలు ఆరోపించాయి. సహ కార్యకర్త స్నేహమయి కృష్ణ గవర్నర్‌కు ఫిర్యాదుతో ఆయన దర్యాప్తునకు ఆదేశించారు. గవర్నర్ ఆదేశాలను ప్రశ్నిస్తూ సిద్ధరామయ్య ఉన్నత న్యాయస్థానంలో దావా వేశారు. విచారణను ఎదుర్కోవాలని న్యాయస్థానం స్పష్టం చేయడంతో లోకాయుక్త విచారణ ప్రారంభించింది. ఇదే క్రమంలో ఈడీకి సైతం స్నేహమయి కృష్ణ ఫిర్యాదు చేయడంతో విచారణ శుక్ర, శనివారాల్లో ముడాపై అధికారులు దాడి చేశారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

20-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.91	1612.18
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	51,587	406
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	51,407	9,934
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.421	42.051

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

కాలువలో మహిళ మృతదేహం

మాన్వి, న్యూస్‌టుడే : తాలూకాలోని 76వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. హిరేకొట్నేకల్ నీటి పారుదల శాఖ సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం కాలువపై గస్తీలో ఉన్న గ్యాంగ్‌మెన్ కాలువలో మృతదేహాన్ని గుర్తించారు. అధికారులకు సమాచారం అందించాడు. మహిళ వయసు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. మాన్వి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏడు మాసాలుగా అందని వేతనాలు

రాయచూరు, న్యూస్‌టుడే : వెనుకబడిన వర్గాల సంక్షేమశాఖ పరిధిలోని వసతి నిలయాల్లో పనిచేస్తున్న పొరుగు సేవల సిబ్బందికి ఏడు మాసాల వేతన బకాయిలు చెల్లించాలని వసతి నిలయాల కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.అమరేశ్ జడ్పీ సీఈవో రాహుల్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి నెలా గౌరవ వేతనం రానందున కుటుంబ నిర్వహణ కష్టసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనబద్ధంగా కల్పించాల్సిన పీఎఫ్, ఈఎస్‌ఐను వర్తింప చేయాలని, వారానికి ఒక సెలవు మంజూరు చేయాలని కోరారు. 15 ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని అనేక సార్లు ఆందోళనలు చేశామని, సంబంధిత అధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తుండటం అత్యంత శోచనీయమని పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో స్పందించి న్యాయం చేయాలని కోరారు.